## విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది

హైదరాబాద్, దళిత, గిరిజన విద్యార్థుల జీవితాలతో ఈ దగాకోరు కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతున్నదని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పడాల సతీశ్ విమర్శించారు. దళిత గిరిజన విద్యార్థుల జీవితాలు ఈ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అగమ్యగోచరంగా తయారయ్యాయని అన్నారు.పేద దళిత, గిరిజన విద్యార్థులు ప్రైవేటు విద్యాసంస్థలలో "బెస్ట్ అవైలబుల్ స్కీమ్" ద్వారా రాష్ట్రం మొత్తం 26 వేల మంది విద్యార్థులు, 230 పైచిలుకు ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారని పడాల సతీశ్ తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు బుక్స్, యూనిఫామ్, భోజన వసతులు పాఠశాలల యాజమాన్యాలు కల్పిస్తున్నాయని అన్నారు.కానీ పాఠశాలలకు చెల్లించాల్సిన ఫీజులను గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం చెల్లించడం లేదని తెలిపారు. దీంతో పాఠశాలలు నడపలేమని యాజమాన్యాలు చేతులెత్తేసే పరిస్థితులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారని అన్నారు. బెస్ట్ అవైలబుల్ పాఠశాలలను మూసివేస్తే పేద దళిత, గిరిజన విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా తయావుతుందని అన్నారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :173 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 14-09-2025 | పేజీలు:4 వెల: 2.00


## కూకట్‌పల్లి రేణు మర్డర్ కేసును మలుపు తిప్పిన క్యాబ్ డ్రైవర్..





హైదరాబాద్, సెప్టెంబర్ 13: కూకట్‌పల్లి రేణు అగర్వాల్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితులు ఇద్దరినీ రాంచీలో కూకట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. హత్యకు ముందు మెదక్ తుప్రాన్‌లో ఒక ఫాం హౌస్ లో హర్ష గ్యాంగ్ పార్టీ చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. పార్టీలో మొత్తం 9 మందిని గుర్తించిన పోలీసులు. ఇందులో నిఖిల్ అనే వ్యక్తిని ఢిల్లీ ఫరీదాబాద్ లో పోలీసులు పట్టుకున్నారు. ఇక క్యాబ్ డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు మొత్తం కేసును ఛేదించారు. హైదరాబాద్ లో కొండాపూర్ నుంచి రాంచీ క్యాబ్ బుక్ చేసుకున్న హర్ష.. సంఘటన జరిగిన రోజే బయల్దేరారు. రాంచీలో వాళ్ళను డ్రాప్ చేసి వస్తున్న సమయంలో ఇన్‌స్టాగ్రామ్‌లో చూసి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చిన క్యాబ్ డ్రైవర్. క్యాబ్ డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

అసలేం జరిగిందంటే?

కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సాన్వీ లేక్ అపార్ట్‌మెంట్‌లో 1311 ఫ్లాట్‌లో రాకేష్ అగర్వాల్, రేణు (50) దంపతులు నివాసం ఉంటున్నారు. రాకేష్‌కు సనత్‌నగర్‌లో స్టీల్ షాప్ ఉంది. వారి ఇంట్లో పది రోజుల క్రితం హర్ష అనే వ్యక్తి పనికి కుదిరాడు. ఎంతో నమ్మకస్తుడి మాదిరి యజమానులను నమ్మించిన హర్ష అదును కోసం ఎదురు చూశాడు. బుధవారం భర్త రాకేష్, కుమారుడు షాప్‌కు వెళ్లగా రేణు ఒక్కతే ఇంట్లో ఉంది. ఇక సాయంత్రం ఆమె భర్త ఇంటికి వచ్చి చూడగా ఇల్లు తాళం వేసి ఉండటం చూసి ఫోన్ చేశాడు. ఫోన్‌ను ఎవరూ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి ప్లంబర్ సహాయంలో తలుపులు తెరిచి చూడగా.. రేణు రక్తం మడుగులో పడి ఉంది.సమాచారం అందుకున్న పోలీసులు రేణు కాళ్లు, చేతులు కట్టేసి కుక్కర్‌తో తలపై, కత్తితో 20 సార్లు పొడిచి హత్య చేసినట్లు గుర్తించారు. హర్షతోపాటు అదే అపార్ట్‌మెంట్‌లో బంధువుల ఇంట్లో పనికి కుదిరిన రోషన్ అనే వ్యక్తి.. వీరిద్దరూ కలిసి ఈ హత్యకు పాల్పడ్డారు. హత్య అనంతరం నిందితులు ఇద్దరూ రక్తంతో తడిసిన దుస్తులను అక్కడే వదిలేసి, స్నానం చేసి స్కూటీపై పరారైనట్లు సీసీటీవీ ఫుటేజీలో రికార్డైంది. రేణు హత్య తర్వాత ఆమె ఒంటిపై 5 తులాల బంగారం, రూ.50 వేల నగదుతో నిందితులు పరారయ్యారు. హత్య సమయంలో రేణు కేకలు వేయకుండా ఉండేందుకు ఆమె గొంతులో కత్తెరతో పొడిచి ఆపై దారుణానికి పాల్పడ్డారు.

## బీఆర్ఎస్ఎల్పీ విలీనం విఫలం రేవంత్ వైఫల్యమే!



హైదరాబాద్,రేవంత్ రెడ్డి సీఎం అయిన ఆరు నెలల్లో బీఆర్ఎస్ఎల్పీ.. కాంగ్రెస్ ఎల్పీలో విలీనం అవుతుంది అని సగటు కాంగ్రెస్ అభిమాని గట్టిగా అనుకున్నాడు. ఎందుకంటే రెండు సార్లు కాంగ్రెస్ ఎల్పీని కేసీఆర్ తన పార్టీలో విలీనం చేసుకున్నారు. దానికి ఖచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటారని భావించారు. కానీ రేవంత్ మొదట్లో.. రెండు సార్లు ఎల్పీల్ని విలీనం చేసుకున్నా.. తమ గెలుపును ఆపలేకపోయారని .. తమకు ఫిరాయింపుల మీద నమ్మకం లేదన్నారు. కానీ తర్వాత ప్రభుత్వం పై కుట్ర చేస్తున్నారన్న సమాచారం రావడంతో.. విధానం మార్చుకున్నారు. కానీ అనుకున్న విధంగా ఆపరేషన్ ఆకర్ష్ ప్రయోగించలేకపోయారు.మొదట్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వచ్చి రేవంత్ తో సమావేశమయ్యేవారు. ఆ వ్యూహం చూసి..ఇక విలీనానికి సరిపడా ఎమ్మెల్యేలు అందరితో చర్చలు పూర్తయ్యాక ఒకే సారి చేర్చుకుంటారని.. టిట్ ఫర్ టాట్ అన్నట్లుగా విలీన ప్రక్రియ ప్రకటిస్తారని అనుకున్నారు. కానీ తర్వాత ఒకరొకరికి కండువాలు కప్పడం ప్రారంభించారు. చివరికి ఆ సంఖ్య పది వద్ద ఆగిపోయింది. ఎల్బీనగర్ సుధీర్ రెడ్డి వంటి వారు కనుసైగ చేస్తే పార్టీలోకి వస్తారని రేవంత్ అనుచరులు అంటారు. కానీ ఎందుకు చేయలేదో కానీ.. పది మంది దగ్గరే ఆగిపోవడంతో ఇప్పుడు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది.కేసీఆర్ .. పార్టీ ఫిరాయింపుల్ని వ్యూహాత్మకంగానే చేశారు. కొంత మందిని చేర్చుకుని మంత్రి పదవులు ఇచ్చినా.. తర్వాత ఆ పార్టీ ఎల్పీల్ని విలీనం చేసుకుని ఓ రూలింగ్ ఇచ్చుకున్నారు. దాని వల్ల ఇప్పుడు కేటీఆర్ సమర్థించుకుంటున్నారు. దమ్ముంటే కేసీఆర్ తరహాలో విలీనం చేసుకోవాలని ఆయన అంటున్నారు. లేకపోతే అనర్హతా వేటు వేయాలని డిమాండ్ చేస్తున్నారు. న్యాయపోరాటం చేయడంతో ఇప్పుడు వేటు వేయడమో..లేకపోతే పార్టీ మారలేదని చెప్పించడమో చేయాల్సి వస్తోంది. ఈ రాజకీయం కాంగ్రెస్ కుఇబ్బందికరంగా మారింది.ఇప్పటికైనా పోయేదేమీ లేదని..కేసీఆర్ నే ఆదర్శంగా తీసుకుని ఆయన తరహాలోనే ఎమ్మెల్యేలను ఆకర్షించి బీఆర్ఎస్ ఎల్పీని విలీనం చేసుకుంటే సమస్య పరిష్కారం అవుతుందన్న అభిప్రాయం కాంగ్రెస్ క్యాడర్ నుంచి వస్తుంది. కానీ ఇప్పుడెవరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతారు?

## రాజకీయాలు చేస్తే హైదరాబాద్ అభివృద్ధి జరిగేదే కాదు..

హైదరాబాద్,రాజకీయాలే ఆలోచించి ఉంటే హైదరాబాద్ అభివృద్ధి జరిగేది కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాజకీయాలు అవసరమే కానీ... సమాజం గురించి కూడా ఆలోచించాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కాంక్లేవ్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. సూపర్ సిక్స్ ద్వారా సంక్షేమం చేస్తున్నాం... అభివృద్ధికి నిధులిస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. సీఎంగా భావితరాల కోసం ఆలోచిస్తున్నట్లు చెప్పారు. 1995లో చాలా కఠిన నిర్ణయాలు తీసుకోవడం వల్లే ఇప్పుడు సంపద పెరిగిందని చంద్రబాబు తెలిపారు. ప్రజలందరికీ ప్రయోజనం కలిగేలా మంచి పబ్లిక్ పాలసీలు తీసుకువచ్చామని ముఖ్యమంత్రి అన్నారు.రాష్ట్ర అభివృద్ధి కోసం విజన్ కల్పన చేయటంతో పాటు దాన్ని సుసాధ్యం చేసే దిశగా పనిచేయాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. భవిష్యత్ తరాల కోసమే విజన్‌ను రూపొందించి అమలు చేస్తున్నామని.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఇది తన బాధ్యత అని స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో వికసిత్ భారత్-2047 అమలు చేస్తుంటే రాష్ట్రంలో స్వర్ణాంధ్ర-2047 విజన్ సిద్ధం చేసి అమలు చేస్తున్నామని వెల్లడించారు. శరీరానికి పోషకాలు ఎంత అవసరమో సమాజానికి మంచి పాలసీల అవసరం అంతే ఉందని సీఎం అన్నారు. వచ్చే 22 ఏళ్లలో మన రాష్ట్రం ఎక్కడ ఉండాలన్న అంశాన్ని నిర్దేశించేందుకే విజన్ రూపొందించి అమలు చేస్తున్నట్టు వివరించారు.

మూడేళ్లలో అమరావతి

అమరావతిలో ప్రారంభించిన ప్రతి పని మూడేళ్లల్లో పూర్తి అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రూ.50 వేల కోట్ల విలువైన మౌలిక వసతుల పనులు పూర్తి అవుతాయన్నారు. 2019లో గెలిచి ఉంటే 2021 నాటికి పోలవరం పూర్తి అయ్యేదని, గత ప్రభుత్వ నిర్వాకం వల్ల డయాఫ్రం వాల్ దెబ్బతిన్నట్లు చంద్రబాబు విమర్శించారు. "అధికారంలోకి వచ్చాక పోలవరంపై దృష్టి పెట్టాం. 2027 డిసెంబరు నాటికి పోలవరం పూర్తి చేస్తాం. కియా ఫ్యాక్టరీ కోసం గొల్లపల్లి రిజర్వాయరును ఒక్క ఏడాదిలో పూర్తి చేసి



నీరిచ్చాం. హంద్రీ-నీవా ప్రాజెక్టు కాల్వల విస్తరణ పనులు కేవలం 100 రోజుల్లో పూర్తి చేసి నీరు ఇచ్చాం." అని సీఎం వివరించారు.

అమరావతి అభివృద్ధి అక్కడితో ఆగదు

"అమరావతిలో మొత్తం ప్రైవేట్ భూములే. హైటెక్ సిటీ రాక ముందు హైదరాబాద్ లో ఎకరం రూ. లక్ష ఉండేది...ఇప్పుడు రూ.100 కోట్లకు చేరింది. పరిశ్రమలు, రహదారుల లాంటి అభివృద్ధి జరిగితే భూమి విలువ పెరుగుతుంది. అమరావతి రైతుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగదు. అమరావతి అభివృద్ధి నిరంతరం. అభివృద్ధిని కొంత మేరకే పరిమితం చేస్తే... అమరావతి ఓ చిన్న మున్సిపాల్టీగా మిగిలిపోతుంది. హైదరాబాద్ తరహాలో అమరావతి కూడా గుంటూరు-విజయవాడ-తెనాలి తదితర ప్రాంతాలు కలిసి మహానగరంగా రూపొందుతుందని చంద్రబాబు వెల్లడించారు. అమరావతిలో 2026 జనవరి నాటికి క్వాంటం వ్యాలీ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఇప్పుడు క్వాంటం కంప్యూటింగ్‌కు అవసరమైన అనుబంధ సంస్థలు పెట్టుబడులతో ముందుకు వచ్చాయి. అలాగే జాతీయ, అంతర్జాతీయ ప్రముఖ విద్యా సంస్థలు కొన్ని ఉన్నాయి. మరికొన్ని రాబోతున్నాయి." అని ముఖ్యమంత్రి ప్రకటించారు.

## బాణసంచాపై దేశవ్యాప్త నిషేధం ఉండాలి

న్యూఢిల్లీ: బాణసంచా వినియోగంపై దేశ రాజధాని ఢిల్లీ(ఎన్‌సీఆర్)లో మాత్రమే ప్రత్యేకంగా నిషేధం ఎందుకు విధించాలని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఢిల్లీలోని కొందరు ధనవంతులు మాత్రమే స్వచ్ఛమైన గాలికి అర్హులా? దేశంలోని ప్రజలంతా స్వచ్ఛమైన గాలి పీల్చుకునేందుకు అర్హులేనని పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని ధర్మాసనం శుక్రవారం దేశ రాజధాని ప్రాంతంలో బాణసంచా వినియోగాన్ని నియంత్రించాలంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టింది. 'ఎన్‌సీఆర్ పరిధిలోని నగరాల్లో ప్రజలకు మాత్రమే పరిశుభ్రమైన గాలికి అర్హులా? మిగతా నగరాల్లోని పౌరులకు ఎందుకు కారు? ఇక్కడ ఎలాంటి విధానముందో దేశవ్యాప్తంగానూ అదే ఉండాలి. ఉన్నత పౌరులుంటున్నారనే కారణంతో ఢిల్లీకి ప్రత్యేకంగా ఒక విధానాన్ని రూపొందించలేం. గత శీతాకాలంలో అమృతసర్ వెళ్లాను. గాలి కాలుష్యం అక్కడ ఢిల్లీ కంటే దారుణంగా ఉంది. బాణసంచాపై నిషేధమే విధించాల్సి వస్తే, అది దేశమంతటా ఉండాలి'అని సీజేఐ పేర్కొన్నారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు గ్రీన్ క్రాకర్స్‌ను తక్కువ రసాయనాలను వినియోగించి రూపొందించే విధానంపై నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్



ఇన్‌స్టిట్యూట్(నీరి) కసత్తు చేస్తోందని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం బాణసంచా తయారీ, విక్రయాల లైసెన్సులపై యథాతథ పరిస్థితిని కొనసాగించాలని పేర్కొన్న ధర్మాసనం..తదుపరి విచారణను 22వ తేదీకి వాయిదా వేసింది.

## నేపాల్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం..



గత నాలుగైదు రోజులుగా అట్టుడికిన నేపాల్‌లో కొత్త అధ్యాయం మొదలైంది. ఆ దేశ చరిత్రలో తొలి ప్రధాన మంత్రిగా మాజీ జస్టిస్ సుశీల కర్కి బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం తాత్కాలిక ప్రధానిగా ఎంపికైన ఆమె రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణస్వీకారం చేశారు. రాత్రి 9:00 గంటల తర్వాత శీతల్ నివాసంలో అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్‌ఆమెతో పదవీ ప్రమాణం చేయించారు.తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కి ఎంపికైన తర్వాత ప్రెసిడెంట్ రామ్‌చంద్ర పౌడెల్ పార్లమెంట్‌ను రద్దు చేశారు. దాంతో, తాత్కాలిక ప్రభుత్వం కొలువుదీరేందుకు మార్గం సుగమం అయింది. రాష్ట్రపతి భవన్‌లో అధ్యక్షుడు పౌడెల్ కర్కితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కొద్దిమంది మంత్రివర్గంతో ప్రధాని క్యాబినెట్‌ను ప్రకటించే అవకాశం ఉంది. షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది మార్చిలో నేపాల్ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నాయి. అప్పటివరకూ సుశీల నేతృత్వంలోని ప్రభుత్వం కొనసాగనుంది.దేశంలో నెలకొన్న అవినీతి పాలన, నాయకుల బంధుప్రీతికి తోడూ సోషల్ మీడియాపై నిషేధం విధించడంపై నేపాల్ యువతరం భగ్గుమంది. ప్రధాని కేపీ ఓలీ సర్కార్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సెప్టెంబర్ 8న శాంతియుతంగా ఆందోళనలకు దిగారు జెన్ జెడ్. అయితే.. పోలీసులు వీళ్లను అణచివేసేందుకు కాల్పులు జరపగా 19 మరణించారు. దాంతో.. ఆగ్రహించిన యువత నిరసనలను హింసాత్మకంగా మార్చాయి. నేపాల్ పార్లమెంట్, సుప్రీంకోర్టుతో పాటు అధ్యక్ష భవనాన్ని ముట్టించిన ఆందోళనకారులు వాటన్నింటికీ నిప్పు పెట్టారు.దాంతో.. సైన్యం ఆదేశాలమేరకే ప్రధాని పదవికి కేపీ ఓలీ రాజీనామా చేశారు. నేపాల్ వ్యాప్తంగా చెలరేగిన ఈ అల్లర్లలో మృతుల సంఖ్య 51కి చేరింది.ప్రధాని కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం గద్దెదిగిన తర్వాత తాత్కాలిక ప్రధాని పదవికి ముగ్గురు మధ్య పోటీ నెలకొంది. మాజీ జస్టిస్ సుశీల కర్కితో పాటు ఇంజనీర్ కుల్మాన్ ఘిసింగ్,ఖాట్మాండ్ మేయర్ బలేంద్ర షాలో ఒకరిని ఎంచుకోవడంపై అభిప్రాయబేధాలు తలెత్తాయి.అయితే.. శుక్రవారం సాయంత్రం నాటికి సైన్యం,అధ్యక్షుడు,ఆందోళనకారుల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. మాజీ జస్టిస్ అయిన సుశీలను తాత్కాలిక ప్రధాని చేసేందుకు ఆమోదం తెలిపారు.

**భారత్ పర్యాటక బస్సుపై దుండగుల దాడి**

ఖాట్మండ్,రాజకీయ అవినీతికి వ్యతిరేకంగా నేపాల్ యువత చేపట్టిన నిరసన కార్యక్రమాలు హింసాత్మకంగా మారిన సంగతి తెలిసింది. ఈ అల్లర్ల నేపథ్యంలో ప్రధాని కేపీ శర్మ ఓలితో పాటు- చాలా మంది మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. మరోవైపు, అల్లర్లలో చాలా మంది లూటీలకు తెగబడ్డారు.

## నకిలీ క్రిప్టో కరెన్సీ కేసులో మాజీ కార్పొరేటర్ అరెస్ట్.. ఏ పార్టీ అంటే..?



కరీంనగర్, క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే మూడింతలు లాభాలు వస్తాయని నమ్మించి ప్రజలను మోసం చేసిన ప్రధాన నిందితులలో మాజీ కార్పొరేటర్ కట్ల సతీష్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు ఇవాళ ( సెప్టెంబర్ 12న) అరెస్టు చేశారు.కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే, వివరాల్లోకి వెళితే.. తీగలగుట్టపల్లికి చెందిన నున్సావత్ భాస్కర్ అనే వ్యక్తి నిన్న ( సెప్టెంబర్ 11న) కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కోతిరాంపూర్ కు చెందిన మాజీ కార్పొరేటర్ కట్ల సతీష్ తనకు పరిచయస్తుడని, అతను 'మెటా ఫండ్ క్రిప్టో' అనే స్కీమ్‌లో పెట్టుబడి పెట్టమని తనకు ఆశ చూపించాడని ఆ కంప్లైంట్ లో పేర్కొన్నారు. ఈ స్కీమ్‌లో రూ. 50 లక్షలు పెట్టుబడి పెడితే మూడింతలు లాభాలు వస్తాయని సతీష్ నమ్మించాడు.. ఆయన మాటలు నమ్మి, గత (2024) సంవత్సరం జూన్ నెలలో రూ. 15 లక్షలను సతీష్‌కు ఇచ్చా.. అలాగే, చాలా మందిని ఈ పథకంలో చేరిస్తే ఎక్కువ లాభాలు వస్తాయని సతీష్ చెప్పడంతో.. తనకు పరిచయస్తులైన మరో 17 మందిని కూడా ఈ స్కీమ్‌లో చేర్చాడు భాస్కర్.ఇక, ఆ 17 మంది ద్వారా గత (2024) సంవత్సరం జూన్ నెలలో సతీష్ మొత్తం రూ. 1.20 కోట్లు వసూలు చేశాడు. ఈ మొత్తానికి మూడు నెలల్లో మూడింతలు లాభాలు ఇస్తానని వారికి హామీ ఇచ్చాడు. కానీ, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా తిరిగి ఇవ్వలేదని బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. సతీష్ ను అడిగినప్పుడు డబ్బులు ఇవ్వకుండా బెదిరించాడని ఆరోపించారు. దీనిపై కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్, సీసీఎస్ సీఐ ప్రకాష్, రూరల్ ఎస్ఐలు నరేష్, తిరుపతితో కలిసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే, సతీష్ దగ్గర నుంచి ఒక ఐపాడ్, రెండు మొబైల్ ఫోన్లతో పాటు కొన్ని బ్యాంక్ అకౌంట్ వివరాలను హస్తగతం చేసుకున్నారు. ఇక, సతీష్‌ను కోర్టు హాజరుపర్చి.. అనంతరం రిమాండ్‌కు తీసుకెళ్లినట్లు పోలీసులు వెల్లడించారు. అలాగే, ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామన్నారు.

## మూసీకి పెరిగిన వరద.. ముసరాంబాగ్ బ్రిడ్జి మూసివేత..

హైదరాబాద్,తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో వాతావరణం మేఘావృతమై ఉంది. అక్కడక్కడ వాన పడుతోంది.కాగా భారీ వర్షాలతో హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ నిండుకుండలా మారాయి. ఈ రెండు జలాశయాల నుంచి మూసీకి వరద ప్రవాహం పెరిగింది. మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో ముసరాంబాగ్ బ్రిడ్జి మూసివేశారు అధికారులు.నిన్న మధ్యాహ్నం నుంచి బ్రిడ్జి మూసివేశారు. ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ని గోల్నాక వైపు మళ్లించారు. వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు అధికారులు.



## భారత్‌పై సుంకం అంత తేలికైన పని కాదు, సంబంధాలు దెబ్బతిన్నాయి..

వాషింగ్టన్:రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారతదేశంపై 50 శాతం సుంకాలు విధించడం వల్ల రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం అంగీకరించారు."భారతదేశం రష్యాకు అతిపెద్ద కస్టమర్. భారతదేశం రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం వల్ల నేను 50 శాతం సుంకం విధించాను. అది చేయడం తేలికైన విషయం కాదు." అని ట్రంప్ ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం ద్వారా భారత్ పరోక్షంగా ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా రష్యాకు నిధులు సమకూరుస్తోందని అమెరికా ఆరోపిస్తోంది. దీంతో ట్రంప్ సర్కార్ 50 శాతం సుంకాలు విధించినట్లు సమర్థించుకుంటోంది. అయితే, ఈ నిర్ణయంపై భారత్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. "సుంకాలు విధించడం అతిపెద్ద విషయమని, అది భారత్‌తో అమెరికా సంబంధాల్లో చీలికకు కారణమైంది" అని ట్రంప్ అన్నారు.ట్రంప్ వాణిజ్య యుద్ధం కారణంగా రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ప్రపంచ




ంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్‌లోని విస్తారమైన పాడి, వ్యవసాయ పరిశ్రమల్లోకి అమెరికా కంపెనీలు రావడాన్ని వ్యతిరేకించినందుకు రెండు దేశాల మధ్య వాణిజ్య ప్రతిష్టంభన ఏర్పడింది. దీని తర్వాత, ట్రంప్ రష్యా ఆయిల్‌ని సాకుగా చూపుతూ ప్రపంచంలో అత్యధికంగా భారత్‌పై టారిఫ్స్ విధించారు.

## సంపాదకీయం

ఆదివారం 14-09-2025

# దేశాన్ని దారిలో పెట్టాల్సిన బాధ్యత యువతదే !

ఒకప్పుడు జాతీయ రాజకీయాల్లో దక్షిణాది నేతలదే హవాగా ఉండేది. ఇప్పుడు అంతగా కనిపించడం లేదు. ముఖ్యంగా తెలుగు వారు జాతీయ రాజకీయాల్లో అరుదుగా ఉన్నారు. క్రమంగా ఒక్కొకరే కనుమరుగు అవుతున్నారు. కొత్త తరం రావాల్సి ఉన్నా రావడంలేదు. యువత రాజకీయాల్లో రాణించాల్సి ఉంది. దేశం అనేక సమస్యలు ఎదుర్కొంటున్న వేళ కొత్త తరాన్ని ఆహ్వానించాలి. రాజకీయాల్లో కూడా రిజర్వేషన్లు రావాలి. రిజర్వేషన్లు వస్తేనే పదవులు పట్టుకుని వేలాడుతున్న వారి స్థానంలో కొత్త రక్తం వస్తుంది. సర్పంచ్ నుంచి, ఎమ్మెల్యేలు, ఎంపిలకు కాలపరిమితి విధించుకోవాల్సి ఉంది. దేశం మూస పద్దతిలో నడవడం వల్లనే బంగ్లాదేశం, నేపాల్‌లో తిరుగుబాట్లు వచ్చాయి. నేపాల్‌లో యువతే ముందుకు కదిలింది. రాజకీయ స్వార్థంతో తీసుకున్న నిర్ణయాలను నిరసించడం ద్వారా దేశాన్ని కదిలించారు. దేశం ఏదైనా పదవీకాంక్షతో చేస్తున్న రాజకీయాల వల్ల ఆ దేశం పురోగమించడం లేదు. మనదేశంలోనూ ఇలాంటి సమస్యలే ఉన్నాయి. వీటిని నిలదీయాల్సి ఉంది. అందువల్ల యువతరం కొత్త ఆలోచనలతో రాజకీయాల్లో అడుగు పెట్టాల్సి ఉంది. పివి నరసింహారావు, జైపాల్ రెడ్డి, పర్వతనేని ఉపేంద్ర, సీతారాం ఏచూరి, సురవరం సుధాకర్ రెడ్డి లాంటి నేతల మరణం తరవాత అంతగా ప్రభావితం చేయగలిగిన నేతలు రావడం లేదు. వెంకయ్యనాయుడు పదవీ విరమణ తరవాత రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉన్నారు. దీంతో తెలుగువారి పాత్ర అంతకంతకూ కనుమరుగు అవుతోంది. ముఖ్యంగా జాతీయ రాజకీయాల్లో తెలుగు వారి పాత్ర లేకుండా పోతోంది. పూర్వపు ఎన్‌డిఎలో చంద్రబాబు నాయుడు కన్వీనర్‌గా బాగానే రాణించారు. ఒకప్పుడు ప్రధాని, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగిన నేతలు ఇప్పుడు అక్కడ కనిపించడం లేదు. చక్రం తిప్పే స్థాయి నుంచి ..ఇప్పుడంతా తెరమరుగు అవుతూ వచ్చారు. గతేడాది సీతారాం ఏచూరి మరణం, మొన్నీ మధ్యనే వయోభారంతో సురవరం సుధాకర్ రెడ్డిల మరణంతో జాతీయస్థాయిలో నిలువగలిగిన నేతలు లేకుండా పోయారు. జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన ఎర్రసూరీడు ఏచూరీ కూడా అస్తమించి ఏడాది కావస్తోంది. ఇంతకాలం ఓ తెలుగు నేత ఉన్నాడన్న ధీమా ఉండేది. చిమ్మ చీకటిలో మిణుమిణుకుమంటూ కనిపించే మిణుగురు పురుగులా సీతారం ఏచూరీ కనిపించేవారు. ఆయన జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. ఒకప్పుడు సర్వేపల్లి రాధాకృష్ణ, నీలం సంజీవరెడ్డి, పివి నరసింహారావు, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి వంటి ఉద్దండులు జాతీయ రాజకీయాల్లో తమదైన ముద్ర వేశారు. తరవాత జైపాల్ రెడ్డి, విద్యాసాగర్ రావు, వెంకయ్యనాయుడు, సురవరం సుధాకర్ రెడ్డి, సీతారాం ఏచూరిలు కనిపించేవారు. ఇప్పుడు ఒక్కొక్కరే అదృశ్యమవుతూ వచ్చారు. ఉపరాష్ట్రపతి పదవి విరమణ తరవాత వెంకయ్య నాయుడు కూడా జాతీయ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. కరీంనగర్‌కు చెందిన సిహెచ్ విద్యాసాగర్ రావు కూడా గవర్నర్ పదవి తరవాత ఇంటికే పరిమితం అయ్యారు. సురవరం సుధాకర్ రెడ్డి కూడా సిపిఐ క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకున్నాక, ఇటీవలే మరణించారు. నిజానికి కెసిఆర్ జాతీయ రాజకీయాల్లో కొనసాగివుంటే మంచి నేతగా రాణించేవారు. ఆయన కూతురు కవితను జాతీయ రాజీయాల్లో కొనసగించినా ఆమె మంచి పట్టు సాధించేవారు. ఎందుకంటే కవిత మంచి ఇంగ్లీష్, హిందీ, ఉర్దూలలో మాట్లాడగలిగే సత్తా ఉన్న నేత. కానీ కెసిఆర్ ఎందుకనో ఆ వైపుగా ఆలోచించలేదు. ఇవాళ ఆమె ఢిల్లీ రాజకీయాల్లో ఉండివుంటే బిఆర్ఎస్‌కు ఇప్పుడీ దుర్గతి పట్టివుండేది కాదు. కెసిఆర్ స్వార్థ, కుటుంబ రాజకీయాల్లో పడిపోవడం వల్ల తనకున్న అవకాశాలను కోల్పోయారనే చెప్పాలి. తెలంగాణ సాధించిన తరవాత కుటుంబ రాజకీయాలను పక్కన పెట్టివుటే కెసిఆర్ అద్భుతంగా రాణించే వారు. భాషాపటిమ, వాక్చాతుర్యం కూడా అద్భుతంగా ఉన్న నేతగా కెసిఆర్ దేశ ప్రజలకు సుపరిచితం.కుటుంబ రాజకీయాలతో ఆయన తనకున్న ఇమేజ్‌ను దెబ్బ తీసుకున్నారు. లేకుంటే జాతీయ రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగేవారు. నిబద్ద రాజకీయాలు నడపకుంటే రాణించడం కష్టం. నిజాయితీ కూడా చాలా ముఖ్యం. అది లేకుంటే ఎంతటివారైనా కాల ప్రవాహంలో కొట్టుకు పోతారు. కెసిఆర్ తనయ కవిత కూడా మంచి వక్త. ఎంపిగా ఆమె బాగా రాణించారు. కానీ లిక్కర్ స్కామ్ ఆమె రాజకీయ ప్రస్థానంపై బురద జల్లింది. ఆ మరకను చెరిపేసుకోవడం అసాధ్యం. దీంతో ఆమె కూడా ఇక రాణించడం కష్టం. జాగృతి పేరుతో ఆమె రాజకీయాలు చేస్తున్నా..తెలంగాణలో ఆ కుటుంబం మొత్తం అవినీతి పంకిలంలో మునిగిన కారణంగా వారిని నమమడం కూడా కష్టమే. మొత్తంగా ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో తెలుగువారు లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. దీనిని పూడ్చాల్సిన బాధ్యత మనపైనే ఉంది. జాతీయ రాజకీయాల్లో మనపాత్ర లేకుంటే ఉత్తరాది వారి పెత్తనం సాగనుంది. ఇప్పటికే బిజెపిలో కేవలం గుజరాత్ పెత్తనమే సాగుతోంది. దేశంపై వారిద్దరే అజమాయిషీ చెలాయిస్తున్నారు. అమిత్ షాకు ఇంగ్లీష్ అంతగా వచ్చినట్లు ఎక్కడా చూడలేదు. కానీ హోంమంత్రిగా నెట్టుకు వస్తున్నారు. జాతీయ రాజకీయాల్లో రాణించాలంటే హిందీ, ఆంగ్లంపై పట్టుతో ముందుకు సాగాల్సి ఉంటుంది. అలాగే దేశ రాజకీయాలను ఔపోసన పట్టాలి. సమస్యలపై అవగాహన ఉండాలి. వాటిపై పోరాటం చేసే సత్తా ఉండాలి. అప్పుడే రాణించగలరు. తెలుగుదేశం నుంచి కేంద్ర విమానాయన మంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న రామ్మోహన్ నాయుడు కొంత లోటు పూడ్చే అవకాశాలు లేకపోలేదు. అయితే పార్టీ ఆయనకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చినప్పుడే ఇది సాధ్యం. ఎందుకంటే రామ్మోహన్ నాయుడు కూడా బాగా చదువుకున్న వాడే కాకుండా యువకుడు. చంద్రబాబు ఆయనకు బాగానే ప్రోత్సాహం ఇస్తున్నారు. ఇంగ్లీష్, హిందీలపై బాగా పట్టు సాధించారు. సమస్యలపై అవగాహన ఉంది. అనర్గళంగా మాట్లాడే స్వభావం ఉంది. పార్లమెంటులో చర్చల్లో ఆయన బాగా రాణిస్తున్నారు. ఢిల్లీ స్థాయిలో పార్టీ వ్యవహారాల్లో కూడా రామ్మోహన్ నాయుడును ప్రోత్సహిస్తే తెలుగుదేశం పార్టీకి మంచి బలం లభించగలదు. తెలంగాణ కు చెందిన కెఆర్ సురేశ్ రెడ్డి కూడా మంచి వక్త. హిందీ, ఇంగ్లీష్‌లలో కూడా ఆయన దిట్ట. కానీ బిఆర్ఎస్ ఆయన వాణిని వినియోగంచు కోవడం లేదు. ఇకపోతే దక్షిణాదికే వస్తే...నిర్మలా సీతారామన్ కూడా మంచి వక్త. సమస్యలపై అవగాహన ఉన్న నేత. ఆంగ్లం, హిందీల్లో బాగా పట్టుంది. అయితే ఆమె కేవలం రబ్బర్ స్టాంప్ రాజకీయాలకు అలవాటు పడ్డారు. పార్టీ లైన్ కన్నా, మోడీ లైన్‌లోనే ఆమె మసలుకోవాల్సి ఉంది. ఈక్రమంలో యువత రాజకీయాల్లో రావడానికి మంచి అవకాశం ఉంది. అందుకు ప్రస్తుతం ఖాళీ కూడా ఉంది. దీనిని పూడ్చగలిగే సత్తా ఉన్న నేతలు ముందుకు సాగితే మంచిది.

# హైదరాబాద్ మూసీకి వరదపోటు...



హైదరాబాద్,ఉపరితల ఆవర్తనం ప్రభావంతో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో రానున్న రెండురోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే వీలుందని తెలిపింది. ఆదివారం వరకు మరికొన్ని జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఇవాళ ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. శనివారం నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. వర్షాల ప్రభావంతో గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే వీలుందని తెలిపింది.జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వర్షాలు దంచి కొడుతున్నాయి. భారీ వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో మానేరు వాగుకు ఇంతకింతకూ పెరుగుతూ భయంకరంగా ప్రవహిస్తోంది. శుక్రవారం ఉదయం ఇసుక కోసం వెళ్లిన ట్రాక్టర్లు మానేరు వరదలో చిక్కుకున్నాయి. ఎనిమిది ట్రాక్టర్లు వరదల్లో చిక్కుకోవడంతో భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయి. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిల్లపల్లి– ఒడేడ్ గ్రామాల మధ్య గల మానేరు వాగులోకి ఇసుకకోసం వెళ్లిన 8 ట్రాక్టర్లు వరదలో చిక్కుకున్నాయి. మొదట అంతగా వరద లేకపోవడంతో ఇసుకను తవ్వుతూ ఉన్నారు. ఉన్నట్లుండి ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరగటంతో ట్రాక్టర్లను అక్కడే వదిలేసి డ్రైవర్లు, కూలీలు వెంటనే బయటకు పరుగెత్తారు. ప్రవాహం పెరుగుతుండటంతో పరిస్థితి భయంకరంగా తయారైంది. వరద ఉధృతికి ట్రాక్టర్లు ఒరిగి పోయిన దృశ్యాలు ఆంతోళన కలిగిస్తున్నాయి. అయితే ఎలాంటి ప్రాణ నష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు పోలీసులు. వెంటనే అక్కడికి చేరుకుని సిబ్బందితో కలిసి సహాయక చర్యలు స్థానిక పోలీసులు చేపట్టారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద పోటెత్తడంతో ఉస్మాన్ సాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో జలమండలి అధికారులు గండిపేట జలాశయం ఆరు గేట్లను నాలుగు అడుగుల మేర పైకి ఎత్తి 2652 క్యూసెక్కుల వరద నీటిని దిగువనున్న మూసీలోకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలోకి 2000 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందని అధికారులు తెలిపారు. మరోవైపు గేట్లు– ఎత్తడంతో మూసీలో వరద ఉధృతి మరింత పెరిగింది. నార్సింగి, మంచిరేవుల మధ్య ఉన్న కల్వర్టు పైనుంచి ఈ వరద నీరు ప్రవహించడంతో అధికారులు ఇరువైపులా రాకపోకలను నిలిపివేశారు. మూసీలో వరద ప్రవాహం అధికంగా ఉండటంతో మున్సిపల్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు లోతట్టు– ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ పరిధిలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. న్యాళ చెరువు, ఆకునూరు ఊర చెరువు సహా పలు కుంటలు వరదనీటితో నిండిపోయాయి. దీంతో పలు గ్రామాల్లో పంటపొలాలు నీటమునిగాయి. సోమారంలో ఆదర్శ పాఠశాల పరిసరాలు జలమయమయ్యాయి. అక్కడి వసతి గృహం చుట్టూ మోకాలి లోతు నీరు చేరింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని బొమ్మకల్ వద్ద కల్వర్టుపై వరద ఉధృతి అధికంగా ఉండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వెనుకేపల్లి తుమ్మలచెరువు మత్తడి పడుతుండడంతో అటు–వైపు రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటు–న్నారు. మరో మూడు రోజుల పాటు– భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైదాపూర్ తహశీల్దార్ శ్రీనివాస్, ఎస్సై తిరుపతి కోరారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దన్నారు. రైతులు పంట పొలాలకు వెళ్లే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం రాత్రి సైదాపూర్‌లో 102 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు– అధికారులు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో కురిసిన భారీ వర్షానికి వాగులు, కుంటలు పొంగి ప్రవహిస్తున్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామ పరిధిలోని ఇందిరాసాగర్ నిండుకుండలా మారి అలుగు పోస్తోంది. మజీద్‌పూర్, గుంతపల్లి గ్రామాల మధ్య ఏరులో వరద నీరు ఉరకలేస్తోంది. కల్వర్టు మీదుగా వరద ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

# వినాయక నవరాత్రుల్లో చెలరేగిపోయిన డీజే టిల్లు!

హైదరాబాద్, ప్రతి ఏడాది తరహాలోనే ఈ సంవత్సరం కూడా వినాయక మండపాల వద్ద డీజే శబ్ధాల మోత ఆగలేదు. దాదాపు అన్ని మండపాల వద్ద ఇదే పరిస్థితి కన్పించిందని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, బ్లడ్ ప్రెషర్ ఉన్నవారు నరకయాతన అనుభవించారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే సౌండ్ సిస్టమ్ అనుమతించాలని హైకోర్టు సూచించినప్పటికీ ఎక్కడా పాటించిన దాఖలాలు లేవని పరిశీలకులు అంటున్నారు. ఎప్పటిలాగే ఈసారి కూడా డీజే శబ్ధాలతో దడ పుట్టించారు. పోలీసులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించారని బాధితులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. శబ్ధాలతో అవస్థలు పడుతున్నామని ఫిర్యాదు చేసిన తరువాత మొక్కుబడిగా వచ్చి మండపాల నిర్వాహకులు చెప్పి వెళ్లిపోవడం మినహా ఏమీ చర్యలు తీసుకోలేదంటున్నారు. ఏ ఒక్క మండపం వద్ద శబ్ధాల తీవ్రతను రికార్డు చేసే డెసిబుల్స్ పరికరాలను ఏర్పాటు చేయలేదు. పోలీసు స్టేషన్లలో కూడా హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. విచ్చలవిడిగా మండపాల వద్ద టపాకాయలు, మందుగుండు వినియోగించారు.

హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు

–వినాయక నవరాత్రులు, పండుగల పేరుతో ఎవరినీ ఇబ్బందులకు గురి చేయరాదని హైకోర్టు గతంలోనే స్పష్టం చేసింది.

–డీజే శబ్దాలపై నిషేధంపై హైకోర్టు ఆదేశాలు ఉన్నా పోలీసులు అమలు చేయడం లేదంటూ కోర్టు ధిక్కరణ పిటీషన్ దాఖలు అయింది.

–దీనిపై హైకోర్టు జస్టిస్ ఎన్.వి.శ్రవణ్ కుమార్ ధర్మాసనం ఈ ఏడాది ఆగస్టు నెల చివరి వారంలో ప్రభుత్వానికి, పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

–సౌండ్ సిస్టమ్ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 వరకు మాత్రమే అనుమతించాలని, గుండెలదిరే శబ్ధాలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖకు స్పష్టం చేశారు.

–గణేష్ ఉత్సవాలు కొనసాగే 11 రోజులు ఫిర్యాదు చేసేందుకు వీలుగా ప్రతి పోలీసు స్టేషన్ లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

స్థానిక సంస్థలు గుర్తించిన కమ్యూనిటీ మైదానాలు, ఖాళీ స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయాలని తన తీర్పులో పేర్కొన్నారు.

వినాయక మండపాల్లో డీజే జోరు

నవరాత్రులు నిర్వహించిన ప్రతి మండపం వద్ద డీజే బాక్సులను ఏర్పాటు చేసి, రాత్రి 10 గంటల నుంచి తెల్లవారు జాము వరకు మోత మోగించారు. ముసలివాళ్ళు అయితే గుండె బిగపట్టుకుని గడిపారు. ఈ శబ్ధాల రొద వినలేక పలువురు డయల్ 100, సంబంధిత పోలీసు స్టేషన్లకు ఫోన్లు చేశారు. పోలీసు స్టేషన్ కు ఫోన్ చేస్తే, 100 ఫోన్ చేయమని పోలీసులు సూచించారని, 100కు కాల్ చేసి చెబితే సంబంధిత పోలీసు స్టేషన్ కు సమాచారం ఇస్తామని చెప్పి ముగించేవారని పలువురు చెబుతున్నారు. చెవులు పగిలిపోయేలా వచ్చే మ్యూజిక్ ను తట్టుకోలేక కొందరు ప్రతి రోజు డయల్ 100 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. పోలీసులు మండపాల వద్దకు వచ్చి నిర్వాహకులతో మాట్లాడి వెళ్లిపోయేవారు. వారు వెళ్లిన మరుక్షణం మళ్లీ డీజే శబ్ధాల దరువు ఆగలేదని ఫిర్యాదుదారులు వాపోతున్నారు. మండపాల వద్ద భక్తి పాటల కన్నా సినిమా పాటలు వేసి డిస్కో డ్యాన్స్ లు చేశారు. ఓ రాములమ్మ, కైకే పాన్ పాన్ బన్ రస్ వాలా, చూపుల్తో గుచ్చి గుచ్చి చంపకే వంటి సినిమా పాటలు వేసుకుని వినాయక విగ్రహాల ముందు డ్యాన్స్ చేశారు. ఎక్కడా సాంస్కృతిక వైభవం మచ్చుకు కూడా కన్పించడం లేదన్న అభిప్రాయాలను భక్తులు వ్యక్తం చేస్తున్నారు. మద్యాన్ని తాగి డ్యాన్స్ లు చేశారనేది బహిరంగ విషయమే. నిమజ్జనం రోజు అయితే బహిరంగంగానే నిర్వాహకులు మద్యం సేవించి ఊరేగింపులో డ్యాన్స్ లు చేశారని మహిళలు మండిపడుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సుమారు 3.3 లక్షల వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

డీజె సౌండ్స్ తో నరకయాతన

–పరిమితికి మించిన శబ్ధాల కారణంగా బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ స్ట్రోక్ వచ్చే ప్రమాదముందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

–భారీ శబ్ధాలతో బీపీ పెరిగి గుండె లయ తప్పుతుందని అంటున్నారు.

– ఈ ఏడాది ఏపీ లో ఒకరు, తెలంగాణ లో మరొకరు ఊరేగింపులో డ్యాన్స్ చేస్తునే కుప్పకూలారని పేర్కొన్నారు.



– నిర్మల్ జిల్లా భైంసా లో ఊరేగింపు వేడుకల్లో పాల్గొన్న ఆరుగురు విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురై కళ్ళు తిరగడం, వాంతులు చేసుకోవడంతో ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు.

–85 డెసిబిల్స్ మించే శబ్ధాలను చెవి ఎట్టి పరిస్థితుల్లో భరించదు.

–డీజేలతో 100 డెసిబిల్స్ కు మించి శబ్ధం తీవ్రత ఉంటుంది.

–వృద్ధులు, గర్భిణీలు, బ్లడ్ ప్రెషర్, గుండె వ్యాధిగ్రస్తులు, చిన్నారులు రాత్రి సమయంలో నిద్రాభంగానికి లోనవుతారాని వైద్యులు వివరించారు.

మహారాష్ట్రలో నిషేధించిన డీజేలు తెలంగాణలోకి

వినాయక చవితిని ఘనంగా జరిపే రాష్ట్రాల్లో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉంటుంది. కానీ.. మహారాష్ట్ర ప్రభుత్వం వినాయక మండపాల వద్ద డీజేల వినియోగాన్ని, ఊరేగింపులో వాడకాన్ని పూర్తిగి నిషేధించింది. ముంబై మహా నగరంలో నిషేధం కట్టుదిట్టంగా అమలు చేయడంతో, అక్కడి వారు తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించారు. మహారాష్ట్రలో ఎక్కువగా నకిలీ డిజే సిస్టమ్ లను ఎక్కువగా వినియోగించారు. వీటిని వినియోగం మూలంగా మనుషుల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, ఏకాగ్రత పూర్తిగా నశిస్తుంది. వీరంతా తెలంగాణలో నవరాత్రులలో వీటిని ఏర్పాటు చేసి, రెండు చేతులా సంపాదించుకుని వెళ్లిపోతున్నారు.

వేలం వెర్రిగా లడ్డూల వేలం పాట, పట్టింపు లేని ఐటీ శాఖ

పలు మండపాల వద్ద నిర్వాహకులు లడ్డూల వేలం పాట చేపట్టారు. నగరంలో అత్యధికంగా గండిపేట మండలం సన్ సిటీ లో రిచ్ మండ్ విల్లాస్ లో లడ్డూను రూ.2.32 కోట్ల కు వేలం వేశారు. నాలెడ్జ్ సిటీ మై హోం భుజా లో రూ.51 లక్షలు, బాలాపూర్ లడ్డూ రూ.35 లక్షలు వెచ్చించి లడ్డూ కొనుగోలు చేశారు. గత పది సంవత్సరాలుగా ఈ వేలం వెర్రి కొనసాగుతున్నది. అయితే ఇప్పటి వరకు ఆదాయపు పన్ను శాఖ నోటీసులు జారీ చేయడం కాని కేసులు నమోదు చేయడం కాని చేయలేదంటున్నారు. వ్యక్తులు కొనుగోలు చేస్తున్నారా, సమూహంగా ఏర్పడి కొనుగోలు చేస్తున్నారా అనేది విచారణ చేస్తే కాని తెలియదు. ఈ వేలం వెర్రిని నిలువరించేందుకు ఆదాయపు పన్ను అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

గ్రేటర్ లో ఒక్క కేసు నమోదు కాలేదు

–మండపాల వద్ధ శబ్ధాల తీవ్రతపై, రాత్రి 10 గంటల నుంచి తెల్లవారు జాము వరకు మోత పై గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఒక్క పోలీసు కేసు కూడా నమోదు కాలేదని సమాచారం.

–అయితే పెద్ద సంఖ్యలో డయల్ 100 కు బాధితులు ఫోన్లు చేసి ఫిర్యాదు చేశారు.

–స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీల సూచనల మేరకు పోలీసులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి.

11 రోజుల పాటూ విగ్రహాల ముందు కార్యక్రమాలు నిర్వహించిన వారు తమ వంతుగా పోలీసు స్టేషన్లలో రూ.5వేల నుంచి రూ.25వేల వరకు ముట్టచెప్పుకున్నట్లు తెలిసింది.

ఇలా చెల్లించిన మండపాల పట్ల పోలీసులు కొంత మెతకగా ఉన్నారని, ఏ విధమైన చర్య తీసుకోలేదని అంటున్నారు.

హైకోర్టు ఆదేశాల ప్రకారం కేసులు నమోదు చేయాల్సిన పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారనే విమర్శలు ఎక్కువగా విన్పిస్తున్నాయి.

అనుమతి ఇచ్చే ముందే అఫిడవిట్ లు తీసుకోవాలి

ప్రతి వినాయక మండపం ముందు నిర్వాహకుల పేర్లు, మొబైల్ నెంబర్లతో బోర్డులు పెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రాజీనామా తరవాత తొలిసారి దర్శనం

న్యూఢిల్లీ, మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఎట్టకేలకు దర్శనమిచ్చారు. ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. రాజీనామా అనంతరం ఆయన బాహ్య ప్రపంచానికి కనిపించడం ఇదే తొలిసారి. ప్రొటోకాల్ ప్రకారం.. ఉపరాష్ట్రపతి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. జూలై 21న రాజీనామా లేఖను రాష్ట్రపతికి పంపారు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే తాను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఆయన నిర్ణయం అందరినీ షాక్‌కు గురి చేసింది. మరో రెండేండ్లు పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. ధన్‌ఖడ్ రాజీనామాపై ప్రతిపక్షాలు పలు అనుమానాలు వ్యక్తం చేశాయి. మరోవైపు రాజీనామా తర్వాత నుంచి ఆయన ఎక్కడా కనిపించడం లేదు. ఆయన్ని కలిసేందుకు పలువురు రాజ్యసభ సభ్యులు ప్రయత్నించినా ఎలాంటి ఫలితం లేదు. ఆయన్ని సంప్రదించలేకపోయారు. దీంతో 'జగదీప్ ధన్‌ఖడ్ ఎక్కడ..?' అంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వచ్చారు. ధన్‌ఖడ్ గృహనిర్బంధంలో ఉన్నారంటూ ప్రచారం కూడా జరిగింది. ధన్‌ఖడ్‌ను తాము చేరుకోలేకపోతున్నామని, ఆయన ఎక్కడ ఉన్నారంటూ ప్రశ్నించారు. ఆయన ఆరోగ్యంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. రాజీనామా చేసినప్పటి నుంచి ధన్‌ఖడ్ గురించి ఎలాంటి సమాచారం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన భద్రతపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ధన్‌ఖడ్‌కు ఏం జరిగింది..? ఆయన క్షేమంగానే ఉన్నారా? ఆరోగ్యంగానే ఉన్నారా..? అని ప్రశ్నించారు. ఆయన్ని కలిసేందుకు పలువురు రాజ్యసభ ఎంపీలు ప్రయత్నించినట్లు– చెప్పారు. కానీ, ఆయన్ని చేరుకోలేకపోతున్నట్లు– వెల్లడించారు. ఆయన ఆరోగ్యం ఎలా ఉంది?వంటి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని కోరారు. ఈ క్రమంలో జూలై 21 రాజీనామా తర్వాత అదృశ్యమైన ధన్‌ఖడ్.. ఇప్పుడు రాష్ట్రపతి భవన్‌లో జరిగిన అధికారిక కార్యక్రమానికి హాజరై తనపై వస్తున్న వార్తలకు చెక్ పెట్టారు. ప్రమాణ స్వీకరం కార్యక్రమంలో మరో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పక్కనే కూర్చుని సంభాషిస్తూ కనిపించారు. ఎంతో ఉల్లాసంగానూ ఉన్నారు. జులై 21న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే ధన్‌ఖడ్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ రోజు ఉదయమంతా రాజ్యసభ కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ఆయన.. రాత్రికల్లా అనూహ్య నిర్ణయాన్ని ప్రకటించారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి దిగిపోతున్నట్లు– తెలిపారు. అయితే, నోట్ల కట్టల కేసుకు సంబంధించిన జస్టిస్ యశ్వంత్‌వర్మ అభిశంసన వ్యవహారంలో కేంద్రంతో విభేదాలు రావడం వల్లే ఆయన వైదొలిగినట్లు– విపక్షాలు ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పదవిని వీడిన తర్వాత తొలిసారి ధన్‌ఖడ్ బయట కనిపించారు.

# ఈ యేడాది చివర్లో భారత్‌కు ట్రంప్

వాషింగ్టన్, రష్యా చమురు కొనుగోలు కారణం చూపి ట్రంప్ విధించిన భారీ సుంకాలతో భారత్–అమెరికా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం రెండు దేశాల మధ్య సుంకాల వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కీలక పరిణామం చోటు– చేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ ఈ ఏడాది చివర్లో భారత్‌కు వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది నవంబర్‌లో భారత్‌లో జరగనున్న క్వాడ్ దేశాధినేతల సదస్సుకు ట్రంప్ హాజరయ్యే అవకాశం ఉన్నట్లు– భారత్‌కు కాబోయే అమెరికా రాయబారి సెర్గీ గోర్ వెల్లడించారు. ఈ సదస్సు కోసం ఆయన ఎదురుచూస్తున్నట్లు– తెలిపారు. ఈ పర్యటనకు సంబంధించి ఇంకా చర్చలు జరుగుతున్నాయని వివరించారు. 2017లో భారత్, జపాన్, అమెరికా, ఆస్ట్రేలియా దేశాలు క్వాడ్ కూటమిని ఏర్పాటు– చేశాయి. నాలుగు అగ్రదేశాలతో ఏర్పడిన కూటమి అధినేతలు 2021 సెప్టెంబరు 24న వాషింగ్టన్‌లో తొలిసారి భేటీ– అయ్యారు. ఇక గతేడాది సదస్సుకు అమెరికా ఆతిథ్యం ఇచ్చింది. ఈ సారి క్వాడ్ దేశాధినేతల సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తున్న విషయం తెలిసిందే. నవంబరులో న్యూఢిల్లీలో జరగబోయే సదస్సుకు ఆయా దేశాధినేతలు హాజరు కానున్నారు. ఈ కూటమి విదేశాంగ మంత్రుల సమావేశం ఈ ఏడాది జనవరిలో అమెరికాలో జరిగిన విషయం తెలిసిందే.

# సీఆర్పీఎఫ్ కి ఒకటే టెన్షన్

న్యూఢిల్లీ,కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభలోని విపక్ష నేత రాహుల్ గాంధీ సెక్యూరిటీపై సీఆర్పీఎఫ్ ఆందోళన వ్యక్తం చేస్తూ ఓ లేఖ రాసింది. జడ్ ప్లస్ కేటగిరీలో ఎస్పీజీ భద్రతలో ఉన్న రాహుల్ గాంధీ "ఎల్లో బుక్" ప్రొటోకాల్ ప్రకారం నడుచుకోవడం లేదని ఆక్షేపించింది. రాహుల్ చర్యల వల్ల ఆయన భద్రత ప్రమాదకరంగా మారిందని సీఆర్పీఎఫ్ రాసిన లేఖలో పేర్కొంది. దేశంలో ఉన్నప్పుడు, విదేశాల్లో పర్యటిస్తున్నప్పుడు కూడా రాహుల్ గాంధీ సెక్యూరిటీ నిబంధనలు పాటించడం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు రాహుల్ గాంధీకి రాసిన లేఖలో సీఆర్పీఎఫ్ ఆరోపించింది.బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి రాహుల్ భద్రతపై ఇదే విధమైన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అంటున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే రాహుల్ భద్రతను పట్టించుకోవడం లేదని పలుమార్లు కాంగ్రెస్ ఆరోపించగా, ప్రతిసారి రాహుల్ సెక్యూరిటీ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని చెబుతూ సీఆర్పీఎఫ్ ఆ ఆరోపణలు ఖండిస్తోంది. 2020 నుంచి ఈ వివాదం మరింత ముదిరింది. గతంలో ఒకసారి రాహుల్ గాంధీ 113 సార్లు సెక్యూరిటీ నిబంధనలు పాటించలేదని వివరిస్తూ సీఆర్పీఎఫ్ లేఖ రాయడం చర్చనీయాంశమైంది.గత కొంతకాలంలో ప్రజల్లో విస్తృతంగా తిరుగుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సెక్యూరిటీ కంచెను దాటుకుని ప్రజలతో మమేకవుతున్నారు. ప్రధానంగా భారత్ జోడో యాత్ర చేసిన నుంచి ఆయన ఎస్పీజీ వలయాన్ని దాటుకుని ప్రజలను కలుసుకుంటున్నారు. ఈ యాత్ర జరిగిన తర్వాత జరిగిన వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో కూడా రాహుల్ నేరుగా ప్రజలతో వన్ టు వన్ మాట్లాడటానికే ప్రాధాన్యమిచ్చారు. అదేవిధంగా ర్యాపిడో రైడర్లతో కలిసి ప్రయాణించడం, లారీ డ్రైవర్ క్యాబిన్ లో కూర్చొని ప్రయాణించడం వంటి చర్యలకు దిగుతున్నారు. దీనివల్ల ఆయనకు భద్రత పరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని సీఆర్పీఎఫ్ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.మరోవైపు సీఆర్పీఎఫ్ కు సమాచారం ఇవ్వకుండా రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలకు వెళుతున్నారని కూడా లేఖలో ఆరోపించింది. ఇటలీ, వియత్నాం, దుబాయ్, ఖతార్, లండన్, మలేషియాల్లో ఆయన పర్యటించిన సమాచారం తమకు తెలియజేయలేదని ఆ లేఖలో సీఆర్పీఎఫ్ వెల్లడించింది. జడ్ ప్లస్ కేటగిరీలో ఉన్న రాహుల్ గాంధీ ఎక్కువ ముప్పు ఉన్న నేతల్లో ఒకరుగా సీఆర్పీఎఫ్ పరిగణిస్తోంది. ఆయనకు వీవీఐపీ హోదాలో అత్యున్నత భద్రత కల్పిస్తున్నారు. నేషనల్ సెక్యూరిటీ గార్డ్ కమాండోలతో సహా దాదాపు 55 మంది సాయుధుల రక్షణ రాహుల్ గాంధీకి ఉంది. కానీ, కాంగ్రెస్ అగ్రనేత ఈ సెక్యూరిటీని ఛేదించుకుని వెళ్లిపోతుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. అయితే ఈ లేఖపై కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు స్పందించలేదు.

# నేపాల్‌లో దారుణ ఘటన

న్యూఢిల్లీ,పొరుగు దేశం నేపాల్ లో జెన్ జనరేషన్- యువత నిర్వహిస్తున్న ఆందోళనలు తారాస్థాయికి చేరాయి. ఆర్మీ కంట్రోల్ లోకి తీసుకున్న తర్వాత పరిస్థితులు కాస్త చక్కబడినట్లే కనిపించినా.. అక్కడక్కడ నిరసనకారులు పేట్రేగిపోతున్నారు. నిరసనల్లో భాగంగా ఒక హోటల్ కు నిప్పు పెట్టడంతో.. భారత్ కు చెందిన మహిళ చనిపోవడం దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్ కు చెందిన రాజేశ్ గోలా అనే 57 ఏళ్ల మహిళ చనిపోయింది. టూర్ కు వెళ్లిన కుటుంబం హయత్ రెజెన్సీలో ఉండగా ఆందోళన కారులు నిప్పు పెట్టారు. హోటల్ మంటల్లో చిక్కుకోవడంతో దూకి పారిపోయే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయినట్లు- ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. మంటలు పూర్తిగా వ్యాపించడంతో భయంతో ఒక్కసారిగా బిల్డింగ్ మీది నించి జంప్ చేసింది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమె భర్త రాంవీర్ సింగ్ గోలా ఆమెను ఖాట్మండులోని త్రిభువన్ యూనివర్సిటీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె చనిపోయినట్లు- వైద్యులు ప్రకటించారు.

# అటవీ అధికారుల త్యాగం చిరస్మరణీయం

హైదరాబాద్,:విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అటవీ శాఖ అధికారుల త్యాగం చిరస్మరణీయమని రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం నెహ్రూ జులాజికల్ పార్కులోఅటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి డాక్టర్ జితేందర్, పిసిసిఎఫ్ సువర్ణ, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 11 వ తేదీన అటవీ అమర వీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకోవటం జరుగుతుందని అన్నారు. ఇదే రోజు 1730 వ సంవత్సరంలో రాజస్థాన్ రాష్ట్రంలో బిష్ణోయి తెగకు చెందిన 360 మంది కేజ్రి చెట్లు- రక్షించుటకు తమ ప్రాణ త్యాగం చేసారని మంత్రి తెలిపారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా విధినిర్వహణలో వన సంపద సంరక్షణ కొరకు జీవితములను త్యాగము చేసిన అటవీ సిబ్బంది సేవలను స్మరించుకుంటు-న్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 1984వ సంవత్సరము నుండి ఇప్పటివరకు 22మంది అటవీ సిబ్బంది ధైర్య సాహసాలతో అంకిత భావంతో పనిచేసి అటవీ నేరములకు పాల్పడిన నేరస్తులను పట్టు-కొనుటలో, అటవీ సంపద పరిరక్షణలో తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించినారని ఈ సందర్భంగా వారి అమూల్యమైన సేవలను గుర్తు చేశారు. అదేవిధంగా అడవులు మరియు వన్య ప్రాణులను రక్షించటంలో నిబద్ధతతో పనిచేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ అధికారులు తమ శాయశక్తుల కృషి చేసి అటవీ రక్షణలో భాగంగా 2014 నుండి 2025 జూలై మాసం వరకు టేకు అలాగే మారు జాతి కలప సంబంధించిన నేరాలను అలాగే 10375 అటవీ భూ ఆక్రమణ కేసులను కూడా పెద్దసంఖ్యలో నమోదు చేయడం జరిగిందని అన్నారు. అలాగే 2025 సంవత్సరంలో రూ. 149.66 కోట్ల కలపకు గాను 96813 కేసులు నమోదు చేసి రూ.లు 51.50 కోట్ల జరిమానా వసూలు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే 18002 వాహనములను కూడా స్వాధీనపరచుకోవడం జరిగిందని అన్నారు. నేరస్తులు తెలియని కేసులు 29858 (÷ఖఉక్ష) నమోదు చేసి రూ. లు 67.13 కోట్ల విలువ కలిగిన టేకు మరియు మారు జాతి కలపను స్వాధీనపర్చుకొని జప్తు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిదంగా అమూల్యమైన అటవీ సంపదను పరిరక్షించడానికి ప్రజల భాగస్వామ్యముతో ఎన్నో పథకాలను మరియు చర్యలను చేపట్టడం జరుగుతుందని అన్నారు. 174 బేస్ క్యాంపులు, 62 చెక్ పోస్టులను ఏర్పాటు- చేయడము జరిగినదని పేర్కొన్నారు.అడవి సరిహద్దుల నిర్వహణకు పశువులు అడవిలో చొరబడకుండా నియంత్రించే కాలువలు నిర్మించడం,??సాయుధ పోలీసు దళాలు కలప అక్రమ రవాణా అరికట్టడానికి తోడ్పాటును అందిస్తున్నాయని తెలిపారు. పి. డి. యాక్ట్ మేరకు టేకు అక్రమ రవాణాదారులను కూడా అరెస్టు చేయడం జరుగుతున్నదని, అటవీ శాఖ సిబ్బంది పోలీసు అధికారుల సాయముతో ఇపటివరకు (5) కేసులు నమోదు చేశామని అన్నారు. అటవీ శాఖ సిబ్బందిని మరింత బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నేరస్తులకు కఠినమైన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని గుర్తు చేశారు. అదేవిదంగా అటవీ సంరక్షణ బలోపేతానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కొత్తగా 2118 వాహనాలు, (2008 మోటారు సైకిళ్ళు, ఎఫ్.బి.ఓ నుండి డి.ఆర్.ఓ వరకు, (110) మహీంద్ర తార్ జీపులు అటవీ క్షేత్రాధికారులకు అందించామని స్పష్టం చేశారు. ప్రభుత్వం 2022 సంవత్సరంలో (1516) రిక్రూట్‌మెంట్ కొరకు అనుమతి ఇచ్చిందని, అందులో భాగంగా (1393) ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు (15) మంది ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, (18) మంది ఏసిఎఫ్ ఇతర పోస్టులు రిక్రూట్‌మెంట్ పక్రియలోఉన్నాయని పేర్కొన్నారు. అడవుల రక్షణ మరియు స్మగ్లింగ్ కార్యకలాపాలను అరికట్టడం కోసం అనేక సమగ్ర చర్యలు ప్రారంభించబడ్డాయని అలాగే వన్యప్రాణుల ఆవాసాలను మెరుగుపరచడానికి పలు కార్యక్రమాలు చేపట్ట ఉన్నట్లు- మంత్రి పేర్కొన్నారు. అటవీ అమరవీరుల దినోత్సవం' సందర్భంగా అటవీ సంరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలుపుతూ మృతుల కుటు-ంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియపరచి అమరుల స్తూపం వద్ద ఈ సందర్భంగా అమూల్యమైన నివాళులు అర్పించారు. అంతకుముందు అమరుల స్తూపం వద్ద పోలీసుల గౌరవ వందనాన్ని ఉన్నతాధికారులతో కలిసి మంత్రి స్వీకరించారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి డాక్టర్ జితేందర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ నదీమ్ అహ్మద్, పిసిసిఎఫ్ హెడ్ సువర్ణ, పిసిసిఎఫ్ వైల్డ్ లైఫ్ ఏలు సింగ్ మేరు, సి సి ఎఫ్ ప్రియాంక వర్గీస్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, వివిధ విభాగాల అధికారులు, అమరుల త్యాగాలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు.

# కాకినాడ మత్స్యకారులకు విముక్తి

కాకినాడ,నావిగేషన్ వ్యవస్థలో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా పొరపాటున శ్రీలంక సముద్ర జలాల్లోకి ప్రవేశించి, అక్కడి జైల్లో ఉన్న కాకినాడ మత్స్యకారులు ఎట్టకేలకు విడుదలయ్యారు. ఆగస్టు 4న కాకినాడలోని జగన్నాధపురం ప్రాంతానికి చెందిన బ్రహ్మానందం సహా మరో ముగ్గురు మత్స్యకారులను అక్రమంగా తమ సముద్ర జలాల్లోకి ప్రవేశించారన్న కారణంతో శ్రీలంక కోస్ట్‌గార్డ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని జాఫ్నా జైల్లో నిర్బంధించారు. కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్.. శ్రీలంకలోని భారత కాన్సుల్ జనరల్ అధికారి సాయి మురళితో మాట్లాడి పరిస్థితిని వివరించారు. ఎప్పటికప్పుడు దిల్లీలోని విదేశాంగశాఖ అధికారులను సంప్రదించి మత్స్యకారుల విడుదలకు చర్యలు తీసుకోవాలని ఒత్తిడి తీసుకొచ్చారు. శ్రీలంకలోని భారత దౌత్య అధికారులు విస్తృత సంప్రదింపులు జరిపి, మత్స్యకారుల తరఫున న్యాయపోరాటం చేసి వారిని విడిపించారు. గురువారం నలుగురు మత్స్యకారులను విడుదల చేసి వారి బోట్లను అప్పగించారు. భారత్ సరిహద్దులో లాంఛనాలు పూర్తయిన తర్వాత బోట్లలో సముద్రమార్గంలో మత్స్యకారులు మరో రెండు రోజుల్లో కాకినాడ చేరుకోనున్నారు.

# గ్రూప్-1 మెయిన్స్ పేపర్లను రీవాల్యుయేషన్ చేస్తారా.. పరీక్ష పెడతారా?




హైదరాబాద్,తెలంగాణ హైకోర్టు గతంలో ప్రకటించిన గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలు రద్దు చేసింది. మళ్లీ మెయిన్స్ పేపర్లను రీవాల్యుయేషన్ చేసి వీటి ఆధారంగా ఫలితాలు వెల్లడించాలని, ఒకవేళ ఇది సాధ్యం కాకపోతే పరీక్షలు మళ్లీ నిర్వహించాలని టీజీపీఎస్సీను హైకోర్టు ఆదేశించింది. ఇందుకు కోర్టు టీజీపీఎస్సీకి 8 నెలల గడుపును విధించింది. ఈ తీర్పు గ్రూప్- 1లో జరిగిన అవకతవకలను బలపరిచింది.గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన న్యాయస్థానం అభ్యర్థుల వాదనలతో ఏకీభవించి తీర్పు వెల్లడించింది. మరి ఇప్పటికైనా ప్రతిభ గల విద్యార్థులకు న్యాయం జరుగుతుందా? లేదా అనేది వేచి చూడాలి.ఈ తీర్పు ప్రభావం భవిష్యత్ నియామకాలపై కూడా పడనుంది.

90 శాతం మంది వారే..

గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షను.. 2024 అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించారు. దాదాపు 21,000 పైచిలుకు అభ్యర్థులు ఈ పరీక్ష రాసారు. ఇందులో 12,000 మంది అంటే 60 శాతం ఇంగ్లీష్‌లో ఎగ్జామ్ రాసారు. ఎంపికైన వారిలో 90 శాతం ఆంగ్లంలో రాసిన విద్యార్థులే ఉన్నారు. తెలుగు మీడియంలో 8,000 మంది విద్యార్థులు అంటే 40 శాతం విద్యార్థులు పరీక్ష రాస్తే, కేవలం 10 శాతంలోపే సెలెక్ట్ అయ్యారు. ఇక్కడ భాషా పరమైన వ్యత్యాసం స్పష్టంగా కనబడుతుంది. ఉర్దూ మీడి యంలో 9 మంది ఎగ్జామ్ రాసారు. వారిలో ఒకరు సెలెక్ట్ అయ్యారు. ఈ గ్రూప్- 1 ఫలితాలను గమనిస్తే తెలుగు మీడియం వాళ్లు చాలా నష్టపోయారని అర్థమవుతుంది. దీంతో గ్రూప్- 1పరీక్ష ఫలితాలపై అభ్యర్థులు పలు అనుమానాలు లేవనెత్తి హైకోర్టును ఆశ్రయించారు. టీజీపీఎస్సీ తన వాదనలో ప్రస్తుతం తెలుగు మీడియం విద్యార్థుల కర్మ, వారి పరిస్థితి అంతే అన్నట్టుగా మాట్లాడింది.


అది నుంచి అనుమానాలే..

గతంలో టీజీపీఎస్సీ అడ్వకేట్‌ను న్యాయమూర్తి గ్రూప్- 1 మెయిన్స్ పేపర్లను దిద్దించే క్రమంలో ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ వాళ్లకి వేరే వేరే కీ ఇచ్చారా? అని అడినప్పుడు ఇవ్వలేదన్నారు. తరువాత వాదనలో కీ ఇచ్చామని చెప్పడం గమనార్హం. దీన్ని బట్టి చూస్తే అసలు మూల్యాంకనం సరిగ్గా జరిగిందా? జరగలేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. గ్రూప్- 1 మెయిన్స్ పరీక్షలో సగటు ఇంగ్లీష్ మీడియం అభ్యర్థికి వచ్చిన మార్కుల కన్నా ఎంతో విశ్లేషణాత్మకంగా రాసిన తెలుగు మీడియం అభ్యర్థులకు తక్కువ రావడమే దీనికి నిదర్శనం. మరోవైపు కొన్ని పరీక్ష సెంటర్ల నుంచే మెజార్టీ అభ్యర్థులు ఎంపిక కావడం పలు అనుమానాలకు దారి తీసింది. గతంలో ఈ నియామకాల్లో ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు ఎంపిక చేస్తున్నప్పుడు జీవో 55ను అనుసరించేవారు. ప్రస్తుత నియామకం కోసం జీవో 29 తీసుకువచ్చారు. దీంతో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఉల్లంఘన జరగడం వలన సామాజిక వర్గాల వారికి అన్యాయం జరిగింది. అయినప్పటికీ ప్రభుత్వం మొండి వైఖరితో ముందుకెళ్లి మెయిన్స్ పరీక్ష నిర్వహించింది. ఇది అభ్యర్థులలో ఆందోళనలకు కారణమయింది.

రీ మెయిన్స్ నిర్వహించడమే పరిష్కారం!

రాష్ట్రంలో గ్రూప్-1 సర్వీసును ఉన్నతమైన ఉద్యోగంగా భావిస్తారు. ఆ సర్వీస్ సాధించాలని నిరుద్యోగుల కల. దాదాపు 10 ఏళ్ల తర్వాత నోటిఫికేషన్ వేశారు. అప్పుడు జరిగిన అవకతవకల నేపథ్యంలో ఒకసారి గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దు అయింది. తర్వాత ప్రభుత్వం మారింది. మళ్లీ నూతన నోటిఫికేషన్‌తో ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. ఇప్పుడు మరోసారి హైకోర్టు గ్రూప్-1 ఫలితాలు రద్దు చేసిన నేపథ్యంలో టీజీపీఎస్సీ పరీక్ష నిర్మాణంలో విశ్వసనీయత, అభ్యర్థులు పరీక్షల పట్ల నమ్మకాన్ని కోల్పోతుంది. ఇప్పుడు హైకోర్టు రీవాల్యుయేషన్, మరొకటి రీమెయిన్స్ గురించి చెప్పింది. ఇందులో రీవాల్యుయేషన్ సాధ్యమయ్యే పరిస్థితి కనబడటం లేదు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియమ నిబంధనలలోని నియమం-3 ప్రకారం ఎట్టి పరిస్థితుల్లోనూ రీవాల్యుయేషన్ లేదనీ చెప్పింది. ఈ నేపథ్యంలో తిరిగి మెయిన్స్ పరీక్ష నిర్వహించడమే సరైనదని నిపుణులు అంటున్నారు. అభ్యర్థులు సైతం పారదర్శకంగా మళ్లీ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. టీజీపీఎస్సీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిన అవసరం ఉంటుంది. ఇప్పటికే అభ్యర్థులు ఆర్థికంగా చాలా నష్టపోయారు. భవిష్యత్ ప్రక్రియ ఎలాంటి అవకతవకలు లేకుండా జరగాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఉద్యోగ నియామకాలపై నమ్మకం కలుగుతుంది.

# జైలు జీవితం కాకాణిని మార్చేసిందా?



అమరావతి, సుమారు 3 నెలలపాటు జైలులో ఉండి బెయిల్ మీద బయటకు వచ్చిన ఆ మాజీ మంత్రిలో కొత్త జోష్ కనిపిస్తుందా? మరోసారి రాష్ట్రంలో తాను కీలక నేతగా మారాలని ప్రయత్నిస్తున్నారా? అధికార పార్టీకి సై అంటే సై అనే రీతిలో సవాల్ విసురుతున్నారా? ఇదే నెల్లూరు పొలిటికల్ సర్కిల్స్ లో నడుస్తున్న చర్చ. తమ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపేందుకు, తన భవిష్యత్తు రాజకీయ ప్రణాళికను రచించుకునేందుకు ఆయనకు జైలే వేదిక అయిందన్న వార్తలు సైతం వస్తున్నాయి. ఇంతకీ ఎవరా మాజీ మంత్రి..? ఏంటా కొత్త జోష్?

జైలుకెళ్లి వచ్చాక.. కాకాణిలో కొత్త జోష్..?

తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలన్నీ ఒక ఎత్తు అయితే.. నెల్లూరు జిల్లా రాజకీయాలు మరొక ఎత్తుగా ఉంటాయి. ఇక్కడ ఎప్పుడూ ఏదో ఒక అంశం హాట్ టాపిక్ గా మారుతూనే ఉంటుంది. ఒక్కో రోజు ఒక్కో వివాదం తెరపైకి వచ్చి రాజకీయ చర్చకు దారితీస్తూ ఉంటుంది. అలాంటి జిల్లాలో ప్రస్తుతం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వ్యవహారం సరికొత్తగా మారింది. జైలుకెళ్ళి వచ్చాక ఆయనలో కొత్త జోష్ కనిపిస్తోంది. వైసీపీ ఏర్పడ్డాక జగన్మోహన్ రెడ్డితో కలిసి కొనసాగుతున్న వారిలో కాకాణి గోవర్ధన్ రెడ్డి కూడా ఒకరు. ఆనం కుటుంబానికి సన్నిహితంగా ఉండే కాకాణి, జిల్లా పరిషత్ చైర్మన్ గా నెల్లూరులో మంచి పేరే తెచ్చుకున్నారు. ఒక దశలో ఆనం కుటుంబానికి కాకాణికి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఆ సమయంలోనే ఆయన వైసీపీ గూటికి చేరారు. వైసిపి నెల్లూరు జిల్లా కన్వీనర్ గా ఎక్కువ కాలం పని చేస్తూ పార్టీని భుజ స్కందాలపై వేసుకున్నారు. జగన్మోహన్ రెడ్డికి ఉన్న ముఖ్య అనుచరుల్లో కాకాణి గోవర్ధన్ రెడ్డి కూడా ఒకరు.

2014, 19లో సర్వేపల్లి నుంచి వరుస విజయాలు

2014లో, 2019లో రెండుసార్లు సర్వేపల్లి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు కాకాణి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక మంత్రివర్గ విస్తరణలో కాకాణి గోవర్ధన్ రెడ్డికి మంత్రిగా అవకాశం ఇచ్చారు నాటి సీఎం జగన్. మంత్రిగా కాకాణి బాధ్యతలు తీసుకున్న తర్వాత అంతకుముందు కంటే ఎక్కువ బాబు. లోకేష్, పవన్ పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రత్యేకించి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పై లెక్క లేనన్ని కామెంట్స్ చేశారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక కాకాణి అవినీతి వెలుగులోకి

2024 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం కుప్ప కూలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వ అవినీతిపై దృష్టి సారించారు. అందులో భాగంగా వరదాపురం వైట్ క్వార్ట్జ్ కేసులో కాకాణి గోవర్ధన్ రెడ్డి పాత్రపై ఆరా తీశారు. కేసులు నమోదు చేశారు. ఈ కేసులో నెల్లూరు సెంట్రల్ జైల్లో రిమాండ్ కి వెళ్లారు కాకాణి. గతంలో ఉన్న 8 కేసుల్లో విచారణ చేపట్టి వాటిల్లోనూ రిమాండ్లు విధిస్తూ వచ్చారు. ఏకంగా 86 రోజులపాటు నెల్లూరు సెంట్రల్ జైల్లో కాకాణి గోవర్ధన్ రెడ్డి రిమాండ్ ఖైదిగా ఉన్నారు. ఇటీవల ఆయనకు అన్ని కేసుల్లోనూ వరుసగా ఊరట లభించి బెయిల్ ఇచ్చింది హైకోర్టు.

మీడియాతో మాట్లాడొద్దు, నెల్లూరుకు రావద్దన్న షరతులు

వివిధ కేసుల్లో పిటి వారెంట్లు ఇచ్చిన సమయంలో విచారణ నిమిత్తం ఆయన జైలు నుంచి బయటికి వచ్చిన ప్రతి సందర్భంలోనూ చిరునవ్వు నవ్వుతూ తనకోసం వచ్చిన నాయకులకు, చేతులు ఊపుతూ వెళ్లేవారు కాకాణి. ఈ క్రమంలో హైకోర్టు బెయిల్ ఇచ్చాక కొన్ని షరతులు విధించింది. కేసుల గురించి మీడియా ఎదుట మాట్లాడకూడదని, నెల్లూరు జిల్లాలో అడుగు పెట్టకూడదని, ప్రతి ఆదివారం విచారణాధికారి ఎదుట హాజరుకావాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో జైలు నుంచి విడుదలైన వెంటనే కాకాణి తాడేపల్లికి వెళ్లిపోయారు. అయితే అంతకుముందు జైలు వద్ద మీడియాతో గట్టిగానే మాట్లాడారు. పలు కేసులు గురించి కూడా ప్రస్తావించారు. ఇక అక్కడి నుంచి అమరావతికి వెళ్లాక హైకోర్టు ఇచ్చిన షరతులపై తిరిగి కోర్టులో పిల్ వేయగా నెల్లూరు జిల్లాలో అడుగుపెట్టకూడదనే నిబంధన ఫై స్టే విధించింది కోర్టు..

మాజీ ఎమ్మెల్యే సతీమణికి పరామర్శ

తిరిగి నెల్లూరుకు వచ్చిన కాకాణి మొదట కావలి నియోజకవర్గం వెళ్లారు. అక్కడి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ రెడ్డి పై వివిధ కేసులు నమోదైన నేపథ్యంలో ఆయన సతీమణి ఆదిలక్ష్మిని పరామర్శించారు. స్థానిక నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని, ప్రతి అధికారినీ గుర్తించుకుంటామని, ఖచ్చితంగా తమ ప్రభుత్వం 2029 లో వస్తుందని అన్నారు. తాము పవర్ లోకి వచ్చాక అందరి కథలూ తెలుస్తామంటూ హెచ్చరికలు జారీ చేశారు. తర్వాత నెల్లూరు లోని తన నివాసానికి వచ్చిన కాకాణిని జిల్లాకి చెందిన వైసిపి నేతలు వరుసగా కలిశారు. మాజీ మంత్రి అనిల్ తో పాటు ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వంటి ముఖ్య నేతలు కాకాణితో భేటీ అయ్యారు. భవిష్యత్తు కార్యాచరణ, జిల్లాలో వైసీపీని ముందుకు తీసుకెళ్లడం తదితర అంశాలపై కాకాణితో చర్చించారు. ఆ తర్వాత తిరిగి మళ్లీ మీడియాతో మాట్లాడిన కాకాణిలో నూతన ఉత్సాహం కనిపించింది. పక్క రోజు తన కుమార్తె పూజిత రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డితో కలిసి మాజీ సీఎం జగన్ తో తాడేపల్లిలో భేటీ అయ్యారు. తాజాగా స్పీకర్ అయ్యన్న పాత్రుడు పోలీసుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసారని, ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ నెల్లూరు వేదయపాలెం పోలీస్ స్టేషన్లో జిల్లాకు చెందిన వైసీపీ ముఖ్య నేతలు తో కలిసి ఫిర్యాదు చేశారు..ప్రస్తుతం కాకాణి గోవర్ధన్ రెడ్డి వైసీపీ లో రాష్ట్ర నాయకత్వంలో కీలక నేతగా మారాలని ప్రయత్నం చేస్తున్నారనేది జిల్లా వ్యాప్తంగా జోరుగా జరుగుతోన్న చర్చ. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వల్లభనేని వంశీతోపాటు అనేకమంది వైసీపీ నేతలు జైలుకి వెళ్లి వచ్చారు. జైలుకెళ్ళి వచ్చాక ఆ నేతలు దాదాపు సైలెంట్ అయ్యారు. కాకాణి మాత్రం నూతనోత్సాహం ప్రదర్శిస్తూ కార్యకర్తల్లో కొత్త జోష్ నింపాలని చూస్తున్నారు. ఈ క్రమంలో తన జిల్లా అధ్యక్ష బాధ్యతను తిరిగి స్వీకరిస్తూ పార్టీ బలోపేతానికి కార్యచరణ రచిస్తున్నారు. అలానే తన కుమార్తె పూజిత రెడ్డికి ఇప్పటికే మహిళా భాగంకి సంబంధించి రాష్ట్ర పదవి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో దక్కింది. ఈ నేపథ్యంలో తన భవిష్యత్తు రాజకీయ కార్యాచరణ పై కూడా కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారట. మొత్తానికి జైలుకెళ్ళి వచ్చాక కాకాణిలో కొత్త జోష్ వచ్చిందని నెల్లూరు వైసీపీ వర్గాలు జోరుగా చర్చించుకుంటున్నాయి. మరి ఈ జోష్ ఇలానే కొనసాగుతుందా కాకాణి భవిష్యత్తు రాజకీయ కార్యాచరణ ఏంటి..? తెలుసుకోవాలంటే కొద్దిరోజులు వేచి చూడాల్సిందే..

# టిటిడి సభ్యుడిగా టివిఎస్ మోటర్స్ అధినేత

అమరావతి, ప్రముఖ వ్యాపారవేత్త టీవీఎస్ మోటార్స్ అధినేత సుదర్శన్ వేణును టీటీడీ బోర్డు కొత్త సభ్యుడిగా ప్రభుత్వం నియమించింది. ఈమేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో నియమితులైన ఓ సభ్యుడు బాధ్యతలు స్వీకరించకపోవడంతో ఖాళీగా ఉన్న స్థానాన్ని సుదర్శన్ వేణు నియామకంతో భర్తీ చేశారు. గతంలో 29 మందితో టీటీడీ పాలకమండలిని ఏర్పాటు చేసింది. అప్పట్లో పాలకమండలి సభ్యుడిగా ఎంపికైన జస్టిస్ హెచ్.ఎల్. దత్తు తన బాధ్యతలు స్వీకరించకపోవడంతో అప్పటి నుంచి ఆ స్థానం ఖాళీగానే ఉంది. ఈ క్రమంలో ఖాళీగా ఉన్న సభ్యుడి స్థానాన్ని భర్తీ చేస్తూ ఈ నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం. జస్టిస్ దత్తు స్థానంలో సుదర్శన్ వేణును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది ప్రభుత్వం. టీటీడీ బోర్డు సభ్యుడిగా సుదర్శన్ వేణు నియామకంతో పాలకమండలి పూర్తి స్థాయిలో కొలువుదీరినట్లయ్యింది. త్వరలోనే సుదర్శన్ వేణు టీటీడీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టనున్నట్లు- తెలుస్తోంది.

# విశాఖవాసుల కొంగుబంగారం కనకమహాలక్ష్మి అమ్మవారు

విశాఖపట్టణం, శరన్నవరాత్రుల్లో విశాఖ శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపడతారు. విశాఖవాసుల కొంగుబంగారం శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు. ఉత్తరాంధ్ర వాసులకే గాక సకల తెలుగు జనావళికి సత్యం గల తల్లిగా, కల్పవల్లిగా కోరిన వరాలిచ్చే అమృతమూర్తిగా భాసిల్లుతోంది. బంగారం కొన్నా వెండి కొన్నా తమ ఇంట వివాహ వేడుకలు జరుగుతున్నా బిడ్డ పుట్టినా విశాఖ ప్రాంతవాసులు ఆ విశేషాన్ని కనకమహాలక్ష్మికి నివేదించి, ఆశీస్సులు అందుకోవడం ఇక్కడి ఆచారం. ఇది గోపురం లేని గుడి. మూలవిరాట్టుకు భక్తులు స్వయంగా పూజలు నిర్వహించుకోవడం ఈ క్షేత్ర విశిష్టత. ఏ వేళలో అయినా దర్శించుకునేందుకు వీలుగా 24 గంటలూ తెరిచి ఉంచే ఆలయం ఇది. ఈ అమ్మవారిని సేవించుకున్నా, స్మరించుకున్నా సకల ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని నమ్మకం. కనకమహాలక్ష్మీ అమ్మవారు ఈ ప్రాంతాన్ని పాలించిన విశాఖ రాజుల ఇలవేల్పు. ఆమె నెలకొన్న ఈ ప్రాంతంలో ఒకప్పుడు విశాఖ రాజుల కోటబురుజు ఉండేదని, అందుచే తల్లి ఉన్న ఈ ప్రాంతాన్ని బురుజుపేటగా పిలుస్తున్నారు. కనకమహాలక్ష్మి ఆలయం మొదటి నుంచీ ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోనే ఉంది. 1912 కాలంలో వీధి వెడల్పు చేస్తున్నప్పుడు అమ్మ వారి విగ్రహం కదపకుండా వీధి మధ్యలోనే ఉంచేసినా 1917లో రోడ్డు మధ్యభాగం నుంచి 30 అడుగుల దూరంలో ఒక మూలగా జరిపారు. అప్పుడే విశాఖలో ప్లేగు వ్యాధి ప్రబలింది. దీంతో ప్రజలు భయభ్రాంతులై అమ్మవారి విగ్రహాన్ని కదిలించడం వల్లే ఈ విపత్తు జరిగిందని భావించి అమ్మవారి విగ్రహాన్ని యథాస్థానంలోకి చేర్చారు. దాంతో ప్లేగు వ్యాధి తగ్గి జనం స్వస్థత చెంది ఇదంతా అమ్మవారి మహత్యం వల్ల జరిగిందన్న ప్రగాఢ విశ్వాసం ప్రబలింది. అప్పటి నుంచి ప్రజలు అమ్మవారికి ఇతోధికంగా పూజలు చేయడం ప్రారంభించారు. కాగా, ఈ గుడికి పైకప్పు కట్టడానికి జరిగిన ప్రయత్నాలు సఫలం కాలేదు. అంటే అమ్మకు అది ఇష్టం లేదని గ్రహించి ఆ తర్వాత ఆ ప్రయత్నాలను విరమించారు. అమ్మ సకల జనులకు అందు బాటులో ఉంటుంది. కనుకనే పూజలు చేసుకోవడానికి వచ్చిన భక్తులు ఎవరికి వారే అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేసి, కొబ్బరికాయలు కొట్టి నివేదించి సేవించుకొనే సంప్రదాయం ఉంది. ముఖ్యంగా స్త్రీలు అమ్మను ఐదవతనాన్ని ఇనుమడింప జేసే దేవతామూర్తిగా భావిస్తారు. అమ్మవారికి గురువారం ప్రీతికరమైన రోజు. ఆ రోజున తెల్లవారినది మొదలు రాత్రి వరకు అమ్మను దర్శించి పసుపు, కుంకుమలతో పూజించి నారికేళం సమర్పించడానికి వచ్చే భక్తులకు అంతుండదు.

# సమకాలీన రాజకీయాల్లో సమున్నత నేత

హైదరాబాద్, సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మరణించి అప్పుడే ఏడాది పూర్తయ్యింది. గతేడాది సెప్టెంబర్ 12 మరణించిన ఏచూరి జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. ఆయన పోయిన ఏడాది లోపే ఇటీవల సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి కూడా వయోభారంతో గతించారు. కానీసీతారం మాత్రం అనూహ్యంగా మరణించారు. ఇకపోతే సీతారాం ఏచూరి మరణం తెలుగువారికి తీరని లోటు. నిబద్ధ రాజకీయాలకు ఆయన పెట్టింది పేరు. అహంకారం కనిపించని మృదుస్వభావిగా జాతీయ రాజకీయాల్లో రాణించారు. సిపిఎం లాంటి పార్టీకి సారథిగా రాణించడం ఆషామాషీ వ్యవహారం కాదు. సమకాలీన రాజకీయాల్లో మంచి పట్టు ఉండడంతో పాటు, పలు భాషల్లో ప్రావీణ్యం సంపాదించడం, ముక్కుసూటిగా మాట్లాడడం, అవసరమున్నంత మేరకే మాట్లాడడం ద్వారా జాతీయ రాజకీయాల్లో ఏచూరి తనదైన ముద్ర వేసారు. జీవితంలో ఆయన ఎక్కడా రాజీపడలేదు. దేశ సమస్యలపై పోరాటం విషయంలో ఆయన రాజీలేని ధోరణితోనే రాజకీయాలు సాగించారు. సంకీర్ణ రాజకీయాలలో సీపీఐ (ఎం) నిర్వహించిన పాత్ర ఎనలేనిది. దానిని ఏచూరి మరింతగా ముందుకు తీసికెళ్లారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కోసం కాంగ్రెస్ నేత పి. చిదంబరంతో కలిసి కనీస ఉమ్మడి కార్యక్రమం ముసాయిదాను రూపొందించారు. 2004లో యూపీఏ ప్రభుత్వ ఏర్పాటు సమయంలో సంకీర్ణ కూటమి నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం ఆయన అలుపెరుగని పోరాటం చేశారు. 'భిన్నత్వంలో ఏకత్వం' అనే సిద్ధాంతాన్ని విశ్వసించారు. దేశంలో ఎక్కడ హింస జరిగినా దానికి వ్యతిరేకంగా గళం విప్పే వారు. పార్టీ అంతర్జాతీయ విభాగానికి ఏచూరి నేతృత్వం వహించారు. పలు సోషలిస్ట్ దేశాలలో పార్టీ మహాసభలు జరిగినప్పుడు సౌహార్ద ప్రతినిధిగా ఆయన హాజరయ్యేవారు.ఏచూరి 2005లో పశ్చిమ బెంగాల్ నుండి రాజ్యసభకు ఎన్నికయ్యారు. అనేక కీలక అంశాలను పార్లమెంట్ దృష్టికి తెచ్చే వారు. ముఖ్యమైన విషయాలపై ప్రశ్నలు సంధించే వారు. పార్లమెంట్ సమావేశాలకు తరచూ అంతరాయం కలిగిస్తున్నారంటూ పాలక పక్షం విమర్శలు చేస్తుంటే 'సమావేశాలకు ఆటంకం కలిగిస్తున్నాయని ప్రతిపక్షాలను నిందించడం ద్వారా ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పించుకోలేదు' అని బదులిచ్చారు. పార్లమెంటును అడ్డుకోవడం ప్రజాస్వామ్యంలో చట్టబద్ధమైన పక్రియ అని చెప్పారు. భారత్-అమెరికా అణు ఒప్పందం కోసం సంప్రదింపులు జరుగుతున్న సమయంలో దానికి తమ పార్టీ విధించిన అన్ని షరతులను ఏచూరి రాజ్యసభలో ప్రస్తావించారు. జెఎన్‌యూ విద్యార్థిగా ప్రస్థానం మొదలు పెట్టిన సీతారం ఏచూరి సిపిఎం పార్టీకి జనరల్ సెక్రటరీగా అద్వితీయమైన భూమిక పోషించారు. భారత రాజకీయాల్లో తనకంటూ ఓ పేజీని లిఖించుకున్నారు. ఆయన పాత్ర చిరస్మరణీయం. ఏచూరి తెలుగువాడు కావడం మనకు గర్వకారణం.

# అంతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే !

హైదరాబాద్,పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలలో ఎనిమిది మంది తాము భారత రాష్ట్ర సమితిలోనే ఉన్నామని .. పార్టీ మారలేదని స్పీకర్ కు సమాధానం ఇచ్చారు. ఆ సమాధానాలను స్పీకర్ కార్యాలయం బీఆర్ఎస్ పార్టీకి పంపింది. దానం నాగేందర్, కడియం శ్రీహరి మాత్రం తమకు మరింత సమయం కావాలని అడిగారు. వీరిద్దరూ తాము ఉపఎన్నికలకు అయినా సిద్ధం కానీ బీఆర్ఎస్ లో ఉన్నట్లుగా చెప్పుకోవడానికి సిద్ధపడటం లేదు. దానం నాగేందర్ కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేయగా..కడియం శ్రీహరి కుమార్తె ఎంపీగా కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలిచారు.గత ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి వీరందరితో సమావేశం అయ్యారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, న్యాయనిపుణులు సూచనలు అన్నింటిపై చర్చించారు. చివరికి వారంతా.. టెక్నికల్ అంశాలనే నమ్ముకోవాలని డిసైడయ్యారు. అందులో భాగంగా.. తాము పార్టీ మారలేదని బీఆర్ఎస్‌లోనే ఉన్నామని సమాధానం ఇచ్చారు. సీఎం ను కలవడం అంటే పార్టీ మారినట్లుగా కాదని అంటున్నారు. ఇప్పుడు వారు పార్టీ మారినట్లుగా బీఆర్ఎస్ ఆధారాలు సమర్పించాల్సి ఉంటుంది. చట్టం ప్రకారం స్వచ్ఛందంగా పార్టీకి రాజీనామా చేసినా.. విప్ ధిక్కరించినా అనర్హతా వేటు పడుతుంది.టెక్నికల్ టెర్మ్స్ ప్రకారం వారెవరూ పార్టీ మారలేదు. దానం నాగేందర్ మాత్రం కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేశారు కాబట్టి ఆయన పార్టీ మారినట్లుగా ఆధారాలు ఉంటాయి. కడియం కూడా తాను పార్టీ మారలేదని చెప్పుకోవడానికి అవకాశం ఉంది. కానీ దానికి ఆయన సిద్ధంగా లేరు. ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే..

# జిల్లాల్లో కదులుతున్న బిఆర్ఎస్ పునాదులు...




హైదరాబాద్, పలు జిల్లాల్లో గులాబీదళం టిఆర్ఎస్‌లోనూ అసంతృప్తి జ్వాలలు కనిపిస్తున్నాయి. పైకి కనిపించనంతగా నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. పార్టీ అగ్రనేతల అవినీతి కారణంగా దాని పతనం స్పష్టంగా కనిపిస్తోంది. కాళేశ్వరం, ఫార్ములా రేస్, గొర్రెల కుంభకోణం, చెరువులు, మిషన్ భగీరథ ఇలా అన్ని కేసులకు సంబంధించి చర్చ గ్రామస్థాయిలో జోరుగా సాగుతోంది. నిప్పులేనిదే పొగరాదన్న రీతిలో సాగుతోంది. దీనికితోడు ఇక్కడా బిజెపి చాపకిందనీరులా మెల్లగా ఆజ్యం పోస్తోంది. అసంతృప్త నేతలను బుజ్జగిస్తోంది. ఈ అవినీతి పార్టీలో ఉంటూ సమాధానం చెప్పుకోలేక కిందిస్థాయిలో నేతలు అపసోపాలు పడుతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే బిఆర్ఎస్ పై అవినీతి బురద స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో పార్టీలో రెండోశ్రేణి నాయకత్వం కొంత ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటోంది. బిఆర్ఎస్‌లో మంత్రులు, మాజీమంత్రులు అసంతృప్తి రాగం వినిపిస్తున్న క్రమంలో జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కేసీఆర్ గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన జోగు రామన్న.. మంత్రిపదవి కోల్పోయాక పెద్దగా చురుకుగా ఉండడం లేదు. తొలిదశలో ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి నిర్మల్ ఎమ్మెల్యే ఇంద్రకరణ్‌రెడ్డికి మాత్రమే చాన్స్ దక్కింది. ఇప్పటికే ఇంద్రకరణ్, వేణుగోపాలాచారిలో బిఆర్ఎస్‌ను వీడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరుగుతున్న పరిణామాలపై బిజెపి వర్గాలు కన్నేసినట్లు సమాచారం. పదవులు లేకుండా,ప్రాధాన్యం లేకుండా ఉన్న నేతలపై బిజెపి నేతలు దృష్టి సారించారని సమాచారం. పలు జిల్లాల్లో బిసిలకు టిక్కెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వంలో ఉన్నా లేకున్నా పదవులు దక్కక పోవడంపై పలువురు నేతలు అసంతృప్తితో ఉన్నట్టుగా వార్తలు వెలువడ్డాయి. గులాబీ కోటలో ముళ్లు గుచ్చుకుంటున్నాయి. కొందరు మెల్లగా స్వరం పెంచుతున్నారు. బిజెపి గాలం వేస్తోందన్న భయాలు ఉన్నాయి. నివురుగప్పిన నిప్పులా ఉన్న అసమ్మతి జ్వాలలు ఎప్పుడైనా దహించే ప్రమాదం లేకపోలేదు. రాజకీయాల్లో ఎల్లకాలం ఒకేలా ఉంటారని అనుకోవడానికి లేదని అంటున్నారు. మొత్తంగా ఈ పరిస్థితిని బిజెపి జాగ్రత్తగా గమనిస్తోంది. ఈ నేపథ్యంలోనే పలువురు బిఆర్ఎస్ సీనియర్ నేతలు పార్టీని వీడతారని సోషల్ మీడియాలో ప్రచారం సాగుతుంది. దీంతో కొందరు నేతలు మీడియాకు ముందుకు వచ్చి వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. అలాగే మాజీ మంత్రి రాజయ్య కూడా కడియం శ్రీహరి లక్ష్యంగా తన అసంతృప్తిని వెళ్ల గక్కుతున్నారు. ఇప్పటికే బాహాటంగా విమర్శలు చేశారు. మొత్తంగా గులాబీకోటలో ఏదో జరుగుతుందన్న ప్రచారం మాత్రం ఊపందుకుంది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పనిచేయడంతో పాటు పార్టీకి నమ్మిన బంటుగా ఉన్న పలువురు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నది నిజం. పార్టీ కోసం ఎంతచేసినా పక్కన పెడుతున్నారని ఆయన అనుచరులు వాపోతున్నారు. మొత్తంగా ఇప్పుడు అసంతృప్త నేతల వ్యవహారం జిల్లాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేమని అంటున్నారు. బిజెపి నేతలు మాత్రం కాచుకుని కూర్చున్నారు. ఇకపోతే అవినీతి కేసుల్లో కెటిఆర్, హరీష్ రావులు అరెస్ట్ అయితే పరిస్థితి మరింత తారుమారు కావచ్చు.

# సాగు విస్తీర్ణంపై దెబ్బకొట్టిన వానలు..యూరియా కష్టాలతో రైతుల కుదేలు



నిజామాబాద్, జిల్లాలో ఈ వానకాలంలో అత్యధికంగా వరిసాగు చేశారని అధికారులు తెలిపారు. నిజాంసాగర్, శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులు ముందే నిండడంతో ఆయకట్టులో పంటల విస్తీర్ణం భారీగా పెరిగింది. అయతే ఇటీవలి వర్షాలు రైతుల ఆశలపై నీళ్లు జల్లాయి. అనేక ప్రాంతాల్ల వరినీట మునిగింది. దీనికితోడు యూరియా కొరత కూడా రైతులను వేధిస్తోంది. జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలు నిండడంతో పంటల సాగు భారీగా పెరిగింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీగా ఈ పంటల విస్తీర్ణం పెరిగింది. ఆరుతడి పంటలకన్నా వరిసాగునే ఎక్కువమంది రైతులు చేశారు. జిల్లాలో పంటల విస్తీర్ణం పెరిగినట్లు ఈ క్రాప్ బుకింగ్ ద్వారా వ్యవసాయ అధికారుల సర్వే ద్వారా ప్రభుత్వానికి నివేదించారు. జిల్లాలో పంటల విస్తీర్ణం భారీగా పెరిగిన రుణాల పంపిణీ మాత్రం అనుకున్నవిధంగా జరగలేదు. ఇప్పటి వరకు 50శాతంలోపే రుణపంపిణీ చేశారు. జిల్లాలో భారీ వర్షాలు పడి పంటల విస్తీర్ణం పెరిగినప్పటికీ రుణ పంపిణీ మాత్రం లక్ష్యాలకు అనుగుణంగా జరగడంలేదు. మే నుంచి సెప్టెంబరు వరకు వానకాలం పంటల రుణాలు ఇవ్వాల్సి ఉన్న ఆగస్టు చివరి నాటికి 50శాతం రుణాలను కూడా పంపిణీ చేయలేదు. జూన్ నుంచి సెప్టెంబరులోపు వందశాతం పంట రుణాలను రైతులకు అందించాలని బ్యాంకుల వారీగా లక్ష్యాలను నిర్ణయించారు. దీనికితోడు ఇటీవల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వేసిన పంటలు నీట మునిగాయి. ఇప్పటి వరకు ఎన్నిమార్లు సమీక్షించినా వానకాలం పంట రుణాలు మాత్రంలక్ష్యం చేరలేదని అంటున్నారు లక్ష్యంలో 50శాతం మేరకు పంపిణీ చేశారు. ఈ నెలాఖరులో వానకాలం పంట రుణాల పంపిణీ కాలం ముగుస్తోంది. ఇంకా మూడు వారాలే గడువు ఉన్న ఇప్పటి వరకు మాత్రం ఏ బ్యాంకు కూడా లక్ష్యాలను చేరుకోలేదు. సెప్టెంబరు నెలంతా రుణాల పంపిణీ చేసిన 70శాతంలోపే పంట రుణాలు రైతులకు అందే అవకాశం ఉంది. బ్యాంకుల ద్వారా రుణాలు అందకపోవడం వల్ల రైతులు ఇతర మార్గాల్లో పంట రుణాలను తెచ్చుకుని పెట్టుబడి పెడుతున్నారు. ఇకపోతే ఆరుతడి పంటలపై ప్రభుత్వం ఎంతగా ప్రచారం చేస్తున్నా.. రైతులు వరికే మొగ్గు చూపుతున్నారు. వాణిజ్య పంటలు, సేంద్రియ పంటలకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీనికితోడు కోతుల భయంతో ఎక్కువమంది వరినే వేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా ఈ వానకాలంలో వరిసాగువైపు రైతులు మొగ్గుచూపారు. బోధన్ డివిజన్ పరిధిలో జూన్, జూలై నెలలో వరినాట్లు పూర్తిచేశారు. నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్ పరిధిలో ఆగస్టు నెలలో ఎక్కువగా ఈ పంటను వేశారు. ఆరుతడి పంటలు ముఖ్యంగా మొక్కజొన్న, సోయా ఎక్కువగా సాగుచేశారు. వర్షాలు ఎక్కువగా ఉండడం వల్ల ఎక్కువ మొత్తంలో ఇతర పంటలను సాగుచేయలేదు. వర్షాలు ఉండడం వల్ల ఈ వానకాలంలో వరిసాగు ఎక్కువగా జరిగినట్లు ఏఈవోలు నిర్వహించిన క్రాప్ బుకింగ్ సర్వేలో బయటపడింది. ఈ వానకాలంలో పసుపు సాగు కూడా 22వేల ఎకరాల్లో చేశారని అంటున్నారు. .జిల్లాలో ఈ వానాకాలంలో సాగు బాగా పెరిగిందని జిల్లా వ్యవసాయ అధికారులు తెలిపారు. రైతులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను శాఖ తరఫున చేశామన్నారు. శ్రీరామ్‌సాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులు నిండడం వల్ల భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. భారీ వర్షాలతో అన్ని చెరువులు జూలై నెలలోనే నిండడంతో సెప్టెంబరు మొదటి వారం వరకు ఆరుతడి పంటలతో పాటు వరిసాగును ఎక్కువమంది రైతులు చేశారు. ఆరుతడి పంటలకు అవకాశం లేకపోవడంతో రైతులు వరిసాగువైపే మొగ్గుచూపారు. ఈ సంవత్సరం ఎక్కువ మొత్తంలో వరిసాగు కావడం వల్ల జిల్లా యంత్రాంగా నికి సవాల్‌గానే మారనుంది. ఈ సంవత్సరం సాగు విస్తీర్ణం పెరగడం వల్ల ధాన్యం కొనుగోలు భారీ మొత్తంలో ఏర్పాటు చేస్తే తప్ప కొనే పరిస్థితి లేదు.

# మూడు రాజధానులు కాదు..వికేంద్రీకరణ అన్నాం



అమరావతి, రాజధాని అమరావతిపై వైసీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.. మూడు రాజధానులని అనలేదని, వికేంద్రీకరణ గురించే మాట్లాడామని మాట మార్చారు. విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని పెడితే ఖర్చు తక్కువ అవుతుందన్నారు.. అయితే, ఇంతకు ముందు అమరావతిని రాజధానిగా తీసేస్తామని మేం అనలేదన్నారు.. అమరావతిని కలుపుకొని ఢీసెంట్రలైజ్ అన్నాం.. అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం అన్నాం.. మూడు రాజధానులు అని తప్పుడు ప్రచారం చేశారన్నారు.. విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని పెడితే శాశ్వత పరిష్కారం అవుతుందున్నారు.. చంద్రబాబు తాను, తన కోటరీ జేబులు నింపుకునే ఆలోచన చేస్తున్నారు.. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు.. అమరావతిని మాయా బజారులాగా కట్టాలని అంటే లక్షల కోట్లు ఖర్చు అవుతుంది.. రాష్ట్రం భరించలేనంత ఖర్చు రాజధానికి అవుతుంది.. చంద్రబాబు రాజధానిని అప్పులు పాలు కాకుండా చూడాలని సలహా ఇచ్చారు. కేంద్రం రాజధానికి డబ్బు ఇస్తే ఎవరికి అభ్యంతరం లేదు.. కానీ, చంద్రబాబు లోను తీసుకోని రాజధాని కడుతున్నారని విమర్శించారు సజ్జల.. అమరావతిని జగన్ అభివృద్ధి చేశారన్న ఆయన... మేం పరిపాలన రాజధాని విశాఖ, న్యాయ రాజధాని కర్నూల్ అనుకున్నాం.. కానీ, మేం అనుకున్నది జరగలేదు.. అమరావతి ప్రాంతంలో రాజధాని కంటిన్యూ అవుతుందని కీలక వ్యాఖ్యలు చేశారు.. అయితే, రాజధాని నిర్మాణం చంద్రబాబు చేతిలో ఉంది.. రాజధాని పూర్తి కాకపోతే వేరే ఆలోచన వచ్చే అవకాశం ఉందన్నారు.. మరోవైపు, రాజధాని మీద శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు సజ్జల.. విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని పెడితే మహా నగరం తయారు అవుతుంది.. 500 ఎకరాల్లో రాజధాని సరిపోతుందని వైఎస్ జగన్ గతంలోనే చెప్పారు.. ఈ ప్రాంతంలో ఇప్పటికే పశ్చిమ బైపాస్ అందుబాటులో ఉంది.. తూర్పు బైపాస్ కూడా అందుబాటు- లోకి వస్తుంది.. దగ్గరలోనే బందరు పోర్టు కూడా ఉంది.. ఇటువైపు అయితే త్వరగా ఒక మహానగరం రెడీ అవుతుందన్నారు సజ్జల.. చంద్రబాబు ఇప్పుడు మళ్లీ ల్యాండ్ పూలింగ్ అంటున్నారు.. చంద్రబాబు లాండ్ పూలింగ్ అంటే అనుమానాలు వస్తున్నాయన్నారు సజ్జల.. లక్షల ఎకరాలు తీసుకుని ఏం చేస్తారు..? అని ప్రశ్నించారు.. రాజధాని కంటిన్యూ చేయడం చంద్రబాబు చేతిలోనే ఉందన్నారు.. రాజధాని పనులు త్వరగా పూర్తి చేస్తే కొత్త ఆలోచనలు రావు.. రాజధాని కాకపోయినా అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తాం అన్నారు వైసీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి..

# డీజిల్‌లో ఐసోబుటనాల్ మిశ్రమం



న్యూఢిల్లీ,దేశంలో ఇంధన దిగుమతుల ఖర్చును తగ్గించేందుకు ఇథనాల్ కలుపుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఇ20 పెట్రోల్ వాడకం గురించి వాహనదారుల్లో ఉన్న అపోహలపై కేంద్రం క్లారిటీ- ఇచ్చింది. అయితే తాజాగా ఇథనాల్‌కు బదులుగా ఐసోబుటనాల్‌ను డీజిల్‌లో కలపనున్నట్లు- కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. డీజిల్‌లో ఇథనాల్‌ను కలిపే ప్రయోగం విజయవంతం కాలేదని.. అందువల్ల దానికి బదులుగా ఐసోబుటనాల్ మెరుగైనది గుర్తించినట్లు- చెప్పారు. డీజిల్‌లో ఇథనాల్ మిక్స్ చేసినప్పుడు ఇంజిన్ సమస్యలతో పాటు- కొన్ని సాంకేతిక సమస్యలు వచ్చాయని చెప్పారు. బయోఫ్యూయల్ మిక్సింగ్ విదేశీ కరెన్సీని ఆదాచేయటంతో పాటు- భారీ ఫ్యూయెల్ బిల్లుల నుంచి ఉపశమనం కల్పిస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. పెట్రోల్ లో ఇథనాల్ మిక్సింగ్ పై సోషల్ మీడియాలో తనపై కావాలనే తప్పుడు ప్రచారం కొనసాగించాలని గడ్కరీ ఇటీవల అన్నారు. అవి పూర్తిగా పెట్రోల్ లాబీ స్పాన్సర్ చేసిన పెయిడ్ ప్రచారం అన్నారు గడ్కరీ. ఈ20 ఇంధనాని కి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారం రాజకీయంగా ప్రేరేపించబడిం దని అన్నారు. ఇథనాల్ వల్ల వాహనాల ఇంజన్లు పాడవుతాయనం పూర్తిగా నిరాధా రమైనదిగా కొట్టిపడేశారు. కానీ కొందరు నిపుణులు మాత్రం ఇథనాల్ వల్ల పాత వాహనాల్లో ఇంజిన్లో తుప్పు,రబ్బర్ భాగాలు పడవటం జరుగుతుందని అంటున్నారు. మైలేజ్ కూడా దెబ్బతింటు-ందని చెబుతున్నారు. ప్రస్తుతం డీజిల్ విషయంలో ఐసోబుటనాల్ కలపాలనుకోవటానికి కారణం అందులో ఇథనాల్ కంటే ఎక్కువ ఎనర్జీ ఉండటమే. డీజిల్‌లో కలిపినప్పుడు ఇంజిన్ పనితీరు మెరుగుపడి కాలుష్యం కూడా తగ్గినట్లు- గుర్తించారు. ఇథనాల్ మాదిరిగానే ఐసోబుటనాల్ కూడా చెరకు, మొక్కజొన్న వంటి పంటల నుంచి తయారు చేస్తారు. ఇక్కడ అసలు సమస్య ఏంటంటే ఐసోబుటనాల్‌ను పెద్ద ఎత్తున ఉత్ప త్తి చేయడమే. దీని శుద్ధికి కర్మాగారాలకు నూ టెక్నాలజీ అవసరం ఉందని తెలుస్తోంది.

# ఇది ఎమ్మెల్యేల చోరీ కాదా? :కేటీఆర్



హైదరాబాద్,తాము కాంగ్రెస్ పార్టీలో చేరలేదని బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేలు చెప్పడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో లోక్ సభ విపక్ష నేత రాహుల్ గాంధీ ఉద్దేశించి కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేరినప్పటి ఫొటోలను షేర్ చేసి ప్రశ్నించారు. ప్రియమైన రాహుల్‌గాంధీ, ఫొటోల్లోని కాంగ్రెస్ కండువాలను గుర్తు పట్టగలరా? ఢిల్లీలో మీతో కలిసిన ఈ ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మీరు గుర్తించగలరా? ఇప్పుడు కారు గుర్తుపై గెలిచిన తర్వాత కాంగ్రెస్‌లో చేరిన ఈ ఎమ్మెల్యేలు అందరూ తాము పార్టీ మారలేదని, ఇది కాంగ్రెస్ కండువా కాదని చెబుతున్నారు. ఇది మీరు అంగీకరిస్తున్నారా? ఇది ఎమ్మెల్యేల చోరీ కాదా? ఇది ఎమ్మెల్యేల చోరీ కాకపోతే ఇంకేంటి..? అంటూ కేటీఆర్ రాహుల్ గాంధీని నిలదీశారు. కాగా, ఓటు చోరీ గురించి రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలు కంటే.. ఎమ్మెల్యేల చోరీ కూడా చిన్న నేరం కాదని ట్విట్టర్‌లో రాహుల్‌కు కేటీఆర్ ట్యాగ్ చేశారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి కండువా పార్టీ కప్పుతున్నప్పుడు.. తిరస్కరించడం సంస్కారం కాదనే భావనతో కండువా కప్పుతున్నారని పేర్కొన్నారు. మేము పార్టీ మారలేదని. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నానని ఎమ్మెల్యేలు తెలిపారు. అభివృద్ధి పనుల కోసమే ముఖ్యమంత్రిని కలిశామని పేర్కొన్నారు. 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. ఈ నేపథ్యంలో వీరి నుంచి వివరణ కోరుతూ స్పీకర్ నోటీసులు జారీ చేశారు. స్పీకర్ కార్యాలయం నుంచి నోటీసులు అందుకున్న 10 మంది ఎమ్మెల్యేల్లో.. బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అరెకపూడి గాంధీ, సంజయ్, గూడెం మహిపాల్ రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, కాలె యాదయ్య, తెల్లం వెంకట్రావు ఇటీవలే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు లిఖితపూర్వకంగా సమాధానాలివ్వగా.. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్ మాత్రం సమాధానాలివ్వడానికి తమకు మరికొంత సమయం కావాలని స్పీకర్‌ను కోరినట్లు సమాచారం.

# లిక్కర్ కేసుతో సంబంధం లేదు..తనకు లిక్కర్ అంటేనే పడదన్న చెవిరెడ్డి




విజయవాడ,విజయవాడలో కోర్టు వద్ద మరోసారి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి హల్‌చల్ చేశారు.. ఏపీ మద్యం స్కాం కేసులో అరెస్ట్ అయిన ఆయన.. అప్పటి నుంచి కోర్టుకు తీసుకొచ్చిన ప్రతీసారి.. ఏదో హల్ చల్ చేస్తూ వస్తున్నారు.. అయితే, తాను ఏ తప్పు చేయకపోయినా కేసు నమోదు చేసి జైల్లో పెట్టారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.. మీడియాలో కూడా ఇష్ట రీతిన అసత్య వార్తలు రాస్తున్నారని.. వారిపై న్యాయపోరాటం చేస్తానన్నారు చెవిరెడ్డి.. తానెప్పుడూ మద్యం వ్యాపారం చేయలేదని.. మద్యం నుంచి ఒక్క రూపాయి ఆదాయం కూడా ఆశించలేదని.. ప్రమాణానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.. మనసా వాచా కర్మణా లిక్కర్ జోలికి ఎప్పుడు పోలేదు.. లిక్కర్ కేసుతో నాకు సంబంధం లేదని పేర్కొన్నారు. నేను ఏడో తరగతి చదివేటప్పుడే మా నాన్న తాగుడు వల్ల మా అమ్మ ఆత్మహత్య చేసుకుంది.. ఇదే తాగుడు వల్ల మా నాన్న చనిపోయాడు.. తాడుగుతోనే మా తమ్ముడు చనిపోయాడు.. దాంతో.. నేను లిక్కర్‌ను ద్వేషిస్తాను.. లిక్కర్ జోలికి పోను అన్నారు చెవిరెడ్డి.. చిన్నప్పటి నుంచి ఇది ఉద్దేశంతో ఉన్నాను.. లిక్కర్ ని ద్వేషించే నన్ను లిక్కర్ కేసులో అరెస్ట్ చేయడం నాకు బాధేసిన్నారు.. పత్రికల్లో విచక్షణారహితంగా అసత్యాలు రాస్తున్నారు..10 శాతం తప్పు చేస్తే 90 శాతం యాడ్ చేయండి.. కానీ, 100 శాతం యాడ్ చేయొద్దు అని సూచించారు.. మనసుకు బాధ వేస్తుంది.. అరెస్టు చేసినందుకు బాధ లేదు.. లిక్కర్ కేసులో అరెస్ట్ చేసినందుకు బాదేస్తుందన్నారు.. 13 ఏళ్లుగా వేద పాఠశాల నడుపుతున్న.. 160 మంది పిల్లలు చదువుతున్నారు. తాగుడు వ్యాపారం చేస్తే నైతికగా హక్కు కోల్పోతాం.. ఇది ధర్మం కూడా కాదన్నారు. ప్రతి మనిషి బతకాలంటే వ్యాపారం చేయాలి. నేను వ్యాపారం చేసుకుంటు-న్నాను.. లిక్కర్ తో సంబంధం ఉండి.. పెట్టు-బడి పెట్టినా.. ఆస్తులు అటాచ్‌మెంట్ కాదు స్వాధీనం చేసుకోండి అని సవాల్ చేశారు.. కానీ, లిక్కర్ తో సంబంధం లేకుండా మా వ్యాపారం మీద, మా కొడుకు మీద పడుతున్నారు.. ఇది న్యాయం కాదు.. దేవుడు ఉన్నాడు అన్నారు.. అయితే, ఏ తప్పు చేయకుండా నేను శిక్ష అనుభవిస్తున్నాను అన్నారు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి..

# సుప్రీంకోర్టు ఆవరణలో నిషేధాజ్ఞలు..రీల్స్ తదితర కార్యకలాపాల నిషేధం



న్యూఢిల్లీ,సుప్రీంకోర్టు ప్రాంగణంలోని హై సెక్యూరిటీ జోన్‌లో ఫొటోలు, రీల్స్ చేయడం, వీడియోలు తీయడంపై సర్వోన్నత న్యాయస్థానం నిషేధం విధిస్తూ సర్క్యులర్ జారీ చేసింది. సెప్టెంబరు 10న జారీచేసిన ప్రకటనలో మీడియా సిబ్బంది ఇంటర్వ్యూలు, వార్తలకు సంబంధించిన ప్రత్యక్ష ప్రసారాలను కేవలం భద్రతా ప్రమాణాలకు అనుగుణమైన జోన్‌లో మాత్రమే నిర్వహించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. కోర్టు ప్రాంగణంలో అధికారిక వినియోగానికి మినహా, వీడియోగ్రఫీ, రీల్స్ చేయడానికి, ఫొటోలు తీయడం కోసం ఉపయోగించే ఫోన్స్, కెమెరా, -ట్రైపాడ్, సెల్ఫీ స్టిక్ వంటి పరికరాలను న్యాయస్థానం నిషేధించింది. ఈ మార్గదర్శకాలను ఉల్లంఘించిన వారిపై బార్ అసోసియేషన్ లేదా రాష్ట్ర బార్ కౌన్సిల్ తగిన చర్యలు తీసుకోవాలి. మీడియా సిబ్బంది, నిబంధనలను అతిక్రమిస్తే ఆ మీడియాకి నెల పాటు- ప్రాంగణంలోకి అడుగు పెట్టకుండా ఆదేశాలు ఇవ్వవచ్చు. కోర్టు సిబ్బంది లేదా రిజిస్ట్రీ, సంబంధిత ఉన్నత అధికారులు ఉల్లంఘనలకు పాల్పడితే తీవ్రంగా పరిగణిస్తూ.. వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటాం అని సర్క్యులర్‌లో పేర్కొంది. హై సెక్యూరిటీ- జోన్‌లో సిబ్బంది, న్యాయవాదులు లేదా ఇతరులు ఫొటోలు లేదా వీడియోలు తీయకుండా నిరోధించే హక్కు భద్రతా సిబ్బందికి ఉంటుందని జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొంది.

# మేడారంలో ఆధునీకరణ పనులు



హైదరాబాద్,ఆసియా ఖండంలో అత్యంత ప్రసిద్ధిగాంచిన సమ్మక్క, సారలమ్మ దేవాలయాన్ని గిరిజన సంస్కృతి సంప్రదాయాలు వారి మనోభావాలకు అనుగుణంగా ఆధునీకరణను చేపడుతున్నామని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి,రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఆధునీకరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ పై శుక్రవారం నాడు సచివాల యంలోని తన కార్యాలయంలో పంచాయితీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎస్.సి.అభివృద్ధి మైనారిటీ- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరామ్ నాయక్ తో కలిసి మంత్రి సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధునీకరణ పనులకు తుది ఆమోదం తెలిపిన తరువాత తక్షణమే పనులు ప్రారంభించి వంద రోజుల్లో పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు మంత్రులు సూచించారు. భక్తులకు మరింత సౌకర్యవంతముగా ఉండేలా చేపట్టే ఆధునీకరణ పనుల్లో గిరిజనుల సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉండాలని,ఈ విషయములో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే మేడారం ఆలయాలకు సంబంధించిన మాస్టర్ ఎలాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పరిశీలించారని,వచ్చే వారంలో ముఖ్యమంత్రి గారు స్వయంగా

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com